# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 49 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 10 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 49 10-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




పి 4 సొసైటీ చైర్మన్‌గా చంద్రబాబు.. వైస్ చైర్మన్‌గా పవన్ కల్యాణ్

2లో



## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు

# కేంద్రం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే**

**తాజాగా రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం**

అమరావతి, హైదరాబాద్ ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు

- తరువాయి 2లో..



## రాజధానిలో ఇంటి నిర్మాణానికి

# సిఎం చంద్రబాబు శంకుస్థాపన

అమరావతి ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజధాని అమరావతిలో తన ఇంటి నిర్మాణ పనులకు బుధవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా శంకుస్థాపన చేశారు. వెలగపూడి సచివాలయం వెనక ఈ 9 రోడ్డు పక్కన ఇంటి నిర్మాణం చేపట్టారు. గత ఏడాది డిసెంబరులో వెలగపూడి రెవెన్యూ పరిధిలో 5 ఎకరాల విస్తీర్ణంలోని నివాస ప్లాట్‌ను ఇదే గ్రామానికి చెందిన రైతు కుటుంబం నుంచి చంద్రబాబు కుటుంబం కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఇంటిని 1,455 చ.గజాల విస్తీర్ణంలో జి ప్లస్ 1 లో నిర్మించనున్నారు. పనులు పూర్తి చేసి ఏడాదిలోపు గృహ ప్రవేశం చేయాలని భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి, మంత్రి లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్ పాల్గొన్నారు. జి+1 పద్ధతిలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ కలిపి కడతారు. ఈ స్థలంలో ఎక్కువ భాగం గ్రీనరీ కోసం కూడా కేటాయించాలని నిర్ణయించారు. చంద్రబాబు ఇంటి నిర్మాణ బాధ్యతను ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించారు.





# ఆదాయ మార్గాలను పెంచండి

## ఎఐ సాంకేతికను వినియోగించండి : చంద్రబాబు



అమరావతి ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా సొంతంగా ఆదాయ మార్గాలు పెంచుకోవలన్నారు ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతో పాటు, ఎక్కడ ఆదాయం తక్కువగా నమోదవుతుందో దానికి గల కారణాలను వెతికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదులు, నోటీసులు జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని చెప్పారు. సచివాలయంలో వివిధ ఆర్థిక శాఖల అధికారులతో నేడు ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించిందన్నారు. అయితే, తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ప్రభుత్వం ఎటువంటి ఆమోదాలైనా తెలపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.. పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని ఆదేశించారు.. అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఇదే తరహా ప్రక్రియ అమలు చేసి పకడ్బందీగా పన్ను వసూళ్లు చేయాలన్నారు. టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారులకు పన్ను చెల్లింపులు, అనుమతులు వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వంలా

- తరువాయి 2లో..

## వరుసగా రెండోసారి

# వడ్డీ రేట్లు సవరణ

- రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు
- 6.25 నుంచి 6 శాతానికి దిగొచ్చిన రెపో రేటు
- హెూమ్, వెహికల్, పర్సనల్ రుణాలపై తగ్గనున్న వడ్డీరేట్లు



న్యూఢిల్లీ ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వరుసగా రెండోసారి కీలక వడ్డీ రేట్లను సవరించింది. రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. దీంతో 6.25 నుంచి 6 శాతానికి రెపో రేటు దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. దీంతో హెూమ్, వెహికల్, పర్సనల్ రుణాలపై వడ్డీరేట్లు తగ్గనున్నాయి. కాగా, ఫిబ్రవరిలోనూ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశీయంగా ద్రవ్యోల్బణం నియంత్రణ దశలోనే ఉంది. 2025 ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.6 శాతానికి దిగొచ్చింది. ప్రధానంగా ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గింది. ఈ క్రమంలోనే బలహీనంగా ఉన్న ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కోసం వడ్డీ రేట్లను ఆర్‌బీఐ తగ్గించింది. ఇక, ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావంతో ప్రపంచ వాణిజ్యంపై ఆందోళనలు పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో యూఎస్‌కు

- తరువాయి 2లో..

# నేడు విశాఖ కోర్టుకు లోకేష్

**సాక్షిపై వేసిన పరువునష్టం కేసులో వాయిదాకు హాజరు**



విశాఖపట్నం ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సాక్షిలో తనపై రాసిన ఉద్దేశపూర్వక తప్పుడు కథనంపై మంత్రి నారా లోకేష్ న్యాయపోరాటం కొనసాగుతోంది. గురువారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం 12వ అడిషనల్ జిల్లా కోర్టులో జరగనున్న క్రాస్ ఎగ్జామినేషన్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరవుతున్నారు. ఇప్పటికే ఓసారి క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. ఈ దఫా క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి కానుండడంతో కేసు కీలక దశకు చేరనుంది. మంత్రి లోకేశ్ తరపున సీనియర్ న్యాయవాది దొద్దాల

- తరువాయి 2లో..

## ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు

# రావాల్సిందే: ఖర్గే

అహ్మదాబాద్: ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలతో మునుపెన్నడూ లేనివిధంగా బీజేపీ మోసానికి పాల్పడి గెలిచిందని, ఈరోజు కాకపోయినా రేపైనా వాస్తవాలు బయటపడతాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అంటున్నారు. ఈ క్రమంలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లను తిరిగి తీసుకురావాల్సిందేనని గట్టిగా గళం వినిపించారాయన. బుధవారం ఏఐసీసీ సమావేశంలో పార్టీ కేడర్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ఖర్గే.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు.**

ప్రపంచమంతా ఈవీఎంల నుంచి బ్యాలెట్ పేపర్ల వైపు మళ్లుతోంది. కానీ, మనం ఇంకా ఈవీఎంలనే ఉపయోగిస్తున్నాం. ఇదే అతి పెద్ద మోసం. టెక్నాలజీని ఉపయోగించుకుని ఈవీఎంలను



- తరువాయి 2లో..

## అమరావతి అభివృద్ధికి

# కేంద్ర సహకారం

**బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి**

విజయవాడ ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ అమరావతి రాజధానిగా మొదటి నుంచి సహకారం అందిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపి దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు. రూ2500 కోట్లు అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం కేటాయించిందని ఆమె పేర్కొన్నారు. బుధవారం ఆమె అమరావతికి కేంద్ర సహకారం గురించి ట్విట్టర్ లో వివరించారు. అవుటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ. 20వేల

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## వారికి భారతరత్న ఎందుకివ్వాలంటే...

మహారాష్ట్ర అసెంబ్లీ మార్చి 22న ఫూలే దంపతులు: మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలేలకు 'భారతరత్న' ఇవ్వాలని అన్ని పార్టీల అంగీకారంతో ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ గౌరవా నికి ఫూలే దంపతులు తప్ప భారతదేశ చరిత్రలో మరో జంట దొరకదు. అసలు ప్రపంచంలోనే రెండు శరీరాలు ఒకే మనస్సుతో జీవితాంతమూ మానవ మార్పునకు కృషి చేసిన జంట మరోటి లేదు. అది ఒక్క ఫూలే జంట మాత్రమే. కేంద్రం వారికి భారతరత్న ఇచ్చి వారిపట్ల తమ గౌరవాన్ని చాటుకోవాలి.

మహాత్మా ఫూలే 1827 ఏప్రిల్ 11న పుడితే, 1831 జనవరి 3న సావిత్రి పుట్టింది. వారు జీవించి ఉన్న కాలానికి కాస్త ఇటు అటు ఈ దేశంలో సంఘ సంస్క ర్తలు ఎదిగారు. వారిలో కొంతమంది స్త్రీల జీవితాలను మార్చాలని ప్రయత్నించారు. ఉదాహరణకు మహారాష్ట్ర లోనే గోవింద రణడే, బెంగాల్‌లో ఈశ్వర చంద్ర విద్యా సాగర్, ఆంధ్రలో కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వారిని తీసుకుందాం. వీరంతా బ్రాహ్మణ కులంలో పుట్టారు. బ్రాహ్మణ కుటుంబాల్లోని ఆడపిల్లలకు విద్య నేర్పించాలని, వితంతు వివాహాలు చేయించాలని మాట్లాడారు, రాశారు. కానీ వారి భార్యల స్థితి తమ కుటుంబాల్లోనే ఎలా ఉండేదో మనకు తెలియదు.

వారి గొప్పతనం గురించి ఎన్నో రచనలు వచ్చాయి. స్కూలు పాఠాల్లో సంఘ సంస్కర్తగా వారి గురించే పాఠాలు చెప్పేవారు. వారు అంటరానితనం గురించి, శూద్ర దళిత స్త్రీల గురించి మాట్లాడిన దాఖలాలే లేవు. కానీ ఫూలేల గురించి ఏ పాఠ్య పుస్తకాల్లో చెప్పేవారు కాదు. వారి గురించి తెలిసిన అగ్ర కుల ఉపాధ్యాయులు వారి గురించి చెడుగా చెప్పే వారు. బెంగాల్‌లో కొద్దిపాటిగా ఉన్న భద్రలోక్ స్త్రీల సంస్కరణ కోసం కృషి చేసిన ఈశ్వరచంద్ర గురించి నేను స్కూల్లో ఉండగానే చదివాను.

కందుకూరి గురించి సరేసరి. కానీ ఫూలే గురించి నాకు తెలిసింది 1986%-%87 ప్రాంతంలో! ఆయన గురించి కాస్తా వివరంగా చదవడానికి ఒక్క పుస్తకం కూడా లేదు. వెతగ్గా, వెతగ్గా కోఠి ఫుట్‌పాత్ పాత పుస్తకాల్లో ధనుంజయకర్ ఆయన మీద రాసిన బయోగ్రఫీ దొరికింది. అది చదివాక నా తల తిరిగి పోయింది. అందులో సావిత్రి బాయి గురించి కొద్దిగానే ఉంది. ఇంత గొప్ప సాంఘిక సంస్కరణకు పాటుపడిన జంటను ఈ దేశ మేధావులు ఎందుకు పక్కకు పెట్టారు? కులం వల్ల!

ఇప్పుడు ఒక ఆరెస్సెస్/బీజేపీ ప్రభుత్వం, అదీ ఒక బ్రాహ్మణ ముఖ్యమంత్రి నేతృత్వంలో ఆ జంటకు భారతరత్న ఇవ్వాలని రిజల్యూషన్ ఎందుకు పాస్ చేసింది? ఈ జంట అనుయాయుడైన అంబేద్కర్ వాళ్ళు ప్రారంభించిన శూద్ర%-%దళిత విద్యా పోరాటం నుండి ఎదిగి ఒక రాజ్యాంగం రాశారు. దానివల్ల శూద్రులకు, దళితులకు ఓటుహక్కు వచ్చింది కనుక! వారి సంఖ్యా బలం, వారి ఆత్మగౌరవ చైతన్యం ఆరె స్సెస్ ప్రభుత్వాన్ని ఈ స్థితికి నెట్టింది. శూద్రుడైన శివాజీని దేశం ముందు పెట్టింది ఫూలేనే!

ఆరెస్సెస్ మాత్రమే కాదు, అగ్రకుల కమ్యూనిస్టు, ముఖ్యంగా బెంగాలీ కమ్యూనిస్టులు, దేశంలోని ఉదార వాదులు ఊహించని పరిణామం ఇది. బెంగాల్ మేధా వులు ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజా రామ్మోహన్ రాయ్, రవీంద్రనాథ్ ఠాగూర్‌లను దేశం మొత్తం విద్యా రంగంలోకి చొప్పించారు. కానీ మహాత్మా ఫూలేను, సావిత్రిబాయిని, అంబేద్కర్‌ను తమ రాష్ట్ర పరిధిలోకి రానివ్వలేదు.

మండల్ కమిషన్ పోరాట చరిత్రను కూడా వాళ్ళు గుర్తించలేదు. ఈ సంవత్సరం ఫూలే దంపతులకు భారతరత్న వస్తే శూద్ర%-%దళిత ఆదివాసీ స్త్రీల చరిత్ర మార్చే చర్చ ఏ రాష్ట్రమూ పక్కకు పెట్టలేనంత ఎదుగుతుంది. ఫూలే జంట కేవలం భారత దేశానికే కాదు మొత్తం భూ ప్రపంచానికే ఏం పాఠం నేర్పారో తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఈ భూమి మీద పెద్ద పెద్ద మతాలను స్థాపించిన బుద్ధుడు, జీసస్, మహమ్మద్ వంటి వారు నడిచారు. అందులో బుద్ధుడు, మహమ్మద్ పెళ్ళిళ్ళు చేసుకున్నారు. జీసెస్ శిలువేసి చంపబడ్డారు. కానీ ఎవరూ ఊహించని రీతిలో జ్యోతి రావు ఫూలే, సావిత్రిబాయిని పెళ్ళి చేసుకొని పెళ్ళి అర్థాన్నే మార్చారు. అందుకు దీటుగా ఆమె భార్య అనే అర్థాన్నే మార్చారు.

వాళ్ళు 19వ శతాబ్దంలో ఎటువంటి భార్యా భర్తలుగా ఈ భూమి మీద నడిచారో కొన్ని ఉదా హరణలతో చూద్దాం. సావిత్రీబాయికి 9వ ఏట, ఫూలేకు 13వ ఏట పెండ్లి అయింది. అది బాల్య వివాహమే. అయితే ఫూలే ఏం చేశారు? ఆమెతో పడక గదిలో భర్తగా జీవించలేదు. ఆమెకు టీచరై అక్కడ చదువు చెప్పారు. అంత గొప్ప పనిచేస్తే పూనా పండితులు తిలక్ నేతృత్వంలో ఆయన తండ్రిని బెదిరించి, బట్టలు బయట పడవేయించి ఇంటి నుండి తరిమేయించారు. ఆ యువ దంప తులు దళిత వాడల్లో మకాం పెట్టి అక్కడే ఒక దళిత మిత్రుడి ఇంట్లో ఆడవాళ్ళకు స్కూలు పెట్టారు. కొద్ది రోజుల్లోనే తన దగ్గర పాఠాలు నేర్చుకున్న సావిత్రిని ఒక టీచర్ని చేశారు ఫూలే.


అంతేగాక కుటుంబాల నుండి బయటికి నెట్టబడ్డ వితంతువుల కోసం ఒక నివాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఒక బ్రాహ్మణ వితంతువు కొడుకు %-% యశ్వంతరావుని పెంచుకున్నారు. అంతకు ముందు వాళ్ళి ద్దరూ 30 ఏండ్ల వయస్సులో ఉండగా సావిత్రి తండ్రి,ఖండోజీ పాటిల్ వచ్చి ఫూలేతో... 'నేను సావిత్రిని ఒప్పించాను, మీకు పిల్లలు కావాలి కనుక మరో పెళ్ళి చేసుకో' అని కోరాడు. దానికి ఫూలే... 'లోపం సావి త్రిలో లేదు, నాలో ఉంది. ఆమెకు మరో పెండ్లి చేద్దాం. ముగ్గురం కలిసి పిల్లల్ని పెంచుతాం' అని బదులు చెప్పారు. ఇటువంటి భర్త ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నాడా!

ఫూలే 1890లో పక్షవాతంతో చనిపోయారు. ఆయన బంధువులు సాదుకున్న కొడుకు తలగోరు (తలకొరివి) పెట్టడానికి వీలులేదు అని గొడవ చేశారు. ఫూలే బంధువులలో ఒక పురుషుడు తలగోరు పెడ తానని వాదించాడు. సావిత్రి వారిని ధిక్కరించి 'నేనే నా భర్తకు తలగోరు పెడతాన'ని చెప్పి ఆ కార్యం నిర్వర్తించారు. ఈ పని చేసిన మొదటి భారత స్త్రీ ఆమె. 1898లో బుబానిక్ ప్లేగు వ్యాపించిన సమయంలో సావిత్రీబాయి, డా" యశ్వంతరావు ప్రజలకు వైద్యం చేస్తూ అదే రోగానికి బలై చనిపోయారు. ఈ జంటను మహారాష్ట్ర అగ్రకుల మేధావులు చాలా కాలం వెలుగులోకి రానివ్వలేదు. ఇప్పుడు ఆరె స్సెస్ ప్రభుత్వం వారికి భారతరత్నను ప్రతిపాదించింది. ఇది కాంగ్రెస్‌కు మరో సవాలు కానుంది. శూద్ర బీసీలను ఆకట్టుకోవడంలో ఇది ఆరెస్సెస్‌కు పెద్ద ఆయుధమౌతుంది. అంబేద్కర్‌కు భారతరత్న వీపీ సింగ్ ప్రభుత్వం ఇచ్చినా ఆరెస్సెస్%-%బీజేపీలు దాన్ని తమ ఖాతాలో వేసుకున్నాయి. కాంగ్రెస్‌ను కుటుంబ పార్టీ అని పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఇప్పుడు ఫూలేలకు భారతరత్నను తమ ప్రభుత్వమే స్వయంగా ఇచ్చిందని పెద్ద ప్రచారం ప్రారంభిస్తాయి. ఈ స్థితిలో తెలంగాణ, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఫూలే లను దీటుగా ఓన్ చేసుకోకపోతే జాతీయ స్థాయిలో ఆ పార్టీకి చాలా పెద్ద సమస్య అవుతుంది. కనీసం ఈ రెండు ప్రభుత్వాల వాళ్ళు అటువంటి తీర్మానాలే అసెంబ్లీలలో పాస్ చేసి కేంద్రానికి పంపడం, ఫూలేలకు శూద్ర బీసీ జీవితాలను ప్రతిబింబించే మ్యూజియమ్‌లను కట్టించడం చెయ్యాలి. ఈ రాష్ట్రాల్లో అగ్రకులాలు తమ చదువులకు పునాదులు వేసిన జంటగా ఫూలేలను చూడటం లేదు. వారి నుండి ఒక్క మేధావి కూడా వారి గురించి రాయడం, మాట్లాడటం చెయ్యడం మనకు కనిపించదు. వారిని గుర్తించి గౌరవించడం అన్ని కులాల ఆత్మగౌరవానికీ నిదర్శనం.

# పి 4 సొసైటీ ఛైర్మన్‌గా చంద్రబాబు..

## వైస్ ఛైర్మన్‌గా పవన్ కల్యాణ్

- నిన్నటిదాకా ఒక లెక్క.. ఇవాల్టి నుంచి మరో లెక్క..
- సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం..
- సంపద సృష్టించాలి ఇది చంద్రబాబు తరచు చెప్పేమాట.
- సంక్షేమ పథకాలు అమలు చేయాలనేది ఆయన ఆలోచన.
- దీని కోసమే మానస పుత్రిక %ూ%-4 రూపు దిద్దుకుంది.
- పి-4 అంటే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్‌నర్‌షిప్ అని అర్థం.



అమరావతి ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం సహా సామాజిక-ఆర్థిక అసమానతలను తగ్గించడం, సమగ్ర అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర -2047 విజన్ ఆధారంగా ఏపీ ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోంది. ఈమధ్యే సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీ4 విధానం ప్రకారం టాప్ పదిశాతంలో ఉన్న సంపన్న వ్యక్తులు, లేదా సంస్థలు అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాలను ఆదుకోవాలి. పేద కుటుంబాలకు స్థలాలు, ఇళ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, ఎల్‌పీజీ కనెక్షన్లు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. ఇప్పుడు దీని ఆచరణలోనే మరో ముందడుగు పడింది. సీఎం చంద్రబాబు ఛైర్మన్ గా %ూ%-4 సొసైటీ ఏర్పాటయింది. దీనికి వైస్ ఛైర్మన్ గా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉంటారు. సీఈవో, డైరెక్టర్‌తో పాటు వారికి అనుసంధానంగా కాల్ సెంటర్, సాంకేతిక బృందం, ప్రోగ్రాం టీమ్, వింగ్ టీమ్?లు ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శులను గుర్తించాలి. ఆగస్టులోగా ఈ సొసైటీకి విధివిధానాలు రూపొందిస్తారు. 5 లక్షల బంగారు కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలనేది చంద్రబాబు లక్ష్యం.

### జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు ఏపీ సర్కార్ జలహారతి కార్పొరేషన్. ఏర్పాటుచేసింది. కంపెనీల చట్టం కింద వంద శాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు అయింది. దీనికి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంటారు. ఇక మంత్రి నిమ్మల రామానాయుడు వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సంస్థ సీఈఓగా జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు ఉంటారు. ఏపీకి రెండు కళ్ల లాంటి పోలవరం ప్రాజెక్ట్, రాజధాని అమరావతి%ౌ%ఈ రెండింటిని పూర్తి చేసే బాధ్యతను కూడా తన భుజస్కంధాల పైనే వేసుకున్నారు చంద్రబాబు. జలహారతి, %ూ%-4 ప్రాజెక్టులు కూడా ఆయన నేతృత్వంలోనే అడుగులు ముందుకు వేయనున్నాయి. ఇలా సీఎం బాధ్యతలతో పాటు.. తన డ్రీమ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకు వెళ్లడానికి చంద్రబాబు ఛైర్మన్‌గా మారారు.

# జగన్ పై పోలీస్ అధికారుల సంఘం ఆగ్రహం..

## 'సారీ' చెప్పాలంటూ డిమాండ్



అమరావతి ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రామగిరి పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి,వైసిపి అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలను పోలీసు అధికారుల సంఘం ఖండించింది. పోలీసులను బట్టలూడదీసి నిలబెడతామనడం గర్హనీయమని పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు విమర్శించారు. మాజీ సిఎంగా జగన్ చేసిన వ్యాఖ్యలపై సభ్యసమాజం ఆలోచించాలన్నారు. "బట్టలూడదీసి నిలబెట్టడానికి ఇదేమైనా ఫ్యాషన్ షోనా? తీవ్ర ఒత్తిడి ఉన్న మాపై ఇలాంటి వ్యాఖ్యలు సరికాదు. వ్యాఖ్యల్ని జగన్ వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలి. లేదంటే న్యాయపోరాటం చేస్తాం" అని శ్రీనివాసరావు హెచ్చరించారు.

## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్, అమరావతి మధ్య దీన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తాజాగా రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీపీఆర్‌లు సిద్ధం చేసి పనులు ప్రారంభించనుంది. అటు, త్వరలోనే అమరావతి రింగ్ రోడ్డు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ ఆర్ఆర్‌కు ఉత్తరభాగం నుంచి హైవే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

## ఆదాయ మార్గాలను పెంచండి

వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదని.. వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం రావాల్సిన పన్నులన్నీ చెల్లించేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. పన్నుచెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీడీ.. ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు నోటీసుల జారీకి, గ్రీవెన్స్‌లు స్వీకరించడానికి ఏఐని వినియోగించి ప్రభుత్వ యంత్రాంగంలో మరింత వేగం పెంచవచ్చని సూచించారు.

## వరుసగా రెండోసారి వడ్డీ రేట్లు సవరణ

కీలక ఎగుమతిదారుగా ఉన్న ఇండియాలో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు, దేశీయంగా వినియోగం, పెట్టుబడుల సామర్థ్యాన్ని కొనసాగించేందుకు వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ కోత విధించింది.

## నేడు విశాఖ కోర్టుకు లోకేష్

కోటేశ్వరరావు, న్యాయవాదులు హాజరవుతున్నారు.

**కేసు నేపథ్యం ఇదీ..**

2019 అక్టోబర్ 22న "చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి.." శీర్షికతో సాక్షి దినపత్రికలో ఓ కల్పిత కథనం ప్రచురించారు. ఈ కథనం పూర్తిగా అవాస్తవాలతో కూడినదని, ఉద్దేశపూర్వకంగా తన ప్రతిష్టను మంట కలపాలనే ఉద్దేశంతో దీనిని ప్రచురించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సాక్షి పత్రికకు రిజిస్టర్ నోటీసు పంపించారు. వారు ఎటువంటి వివరణ ఇవ్వకపోవడం, నోటీసులకు స్పందించకపోవడంతో నారా లోకేశ్ తన న్యాయవాదులతో పరువునష్టం దావా వేశారు. ఆ కథనంలో పేర్కొన్న రోజులలో తాను విశాఖలోనే లేనని కోర్టుకు తెలిపారు. ప్రభుత్వ ఆహ్వానం మీద వచ్చే అతిథులకు చేసిన మర్యాదల ఖర్చును తనకు అంటగడుతూ తన ప్రతిష్టని మసకబార్చేందుకు చేసిన కుట్ర అని, దీనిపై విచారించి న్యాయం చేయాలని లోకేష్ కోర్టుని కోరారు.

## ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు రావాల్సిందే: ఖర్గే

తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మళ్లీ.. ఈవీఎంల మోసాల్ని నిరూపించాలని వాళ్లే మమ్మల్ని అడుగుతున్నారు. ఈ విషయంలో యువతరం మేల్కొవాలి. బ్యాలెట్ పేపర్లు కావాలని ముందుకు వచ్చి పోరాడాలి. మహారాష్ట్రలో ఏం జరిగింది?. ఈవీఎంలతో అతిపెద్ద మోసం జరిగింది. అక్కడ ఎలాంటి ఓటర్ల జాబితాను రూపొందించారు?. బీజేపీ 90 శాతం సీట్లు ఎలా నెగ్గింది?. ఎన్నికల చరిత్రలోనే ఇలా ఎప్పుడూ జరగలేదు. అసలు మహారాష్ట్ర ఎన్నికలే పెద్ద మోసం. ఈ అంశాన్ని మేం దాదాపు ప్రతీ చోటా ప్రస్తావించాం. రాహుల్ గాంధీ గట్టిగా గళం వినిపించారు. హర్యానాలోనూ అదే జరిగింది. మా లాయర్లు, నేతలు.. ఆ దొంగలను దొరకబట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉంటాం. ఏదో ఒకనాటికి వాస్తవాలు బయటపడక తప్పదు. చట్టసభల్లో ప్రతిపక్షంగా మన గళం వినిపించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఏకపక్షంగా కేంద్రం బిల్లులను ఆమోదించుకుంటోంది. అలాంటప్పుడు ప్రజల గొంతుకను ఎలా వినిపిస్తాం?. అమెరికా టారిఫ్‌ల మీద చర్చకు అవకాశం ఇవ్వలేదు. మణిపూర్‌పై వేకువ జామున 4 గంటలకు చర్చిస్తామన్నారు. ఉదయం చర్చించాలని నేను అడిగితే తిరస్కరించారు. ప్రభుత్వం ఏదో దాస్తుందో కాబట్టే ఇలాంటి పనులు చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని నెమ్మది నెమ్మదిగా అంతం చేయాలని చూస్తున్నారు. రాజ్యాంగం మీద గత 11 ఏళ్లు దాడి జరుగుతూనే ఉంది. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనకు ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ అభివృద్ధి కోసం పలు సంస్థలను స్థాపించింది. కానీ, ప్రభుత్వ సంస్థలను మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులపరం చేసింది. జాతి ప్రయోజనాల కంటే.. ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాలే ముఖ్యంగా ఈ ప్రభుత్వం భావిస్తోంది. ఆఖరికి.. రిజర్వేషన్లనూ ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నంలో ఉంది. ఇది ఇలాగే కొనసాగితే దేశాన్ని అమ్మేసే ప్రమాదం లేకపోలేదు. బీజేపీ ఆరెస్సెస్‌లు మతపరమైన అంశాలతో వివాదాలు సృష్టించాలనుకుంటున్నాయి. మసీదుల కింద శివలింగాలను వెతకడం లేదంటూనే ఆ పని చేస్తున్నారు. ప్రధాని మోదీ మంట పెడితే.. ఆరెస్సెస్ దానికి ఆజ్యం పోస్తోంది. రాజస్థాన్ ఆల్వార్ ఘటనతో బీజేపీ దళిత వ్యతిరేక ధోరణి బయటపడింది. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ సుంకాలు పెంచడం, గ్యాస్ ధరలను పెంచడం ద్వారా ప్రజల నడ్డి విరుస్తున్నారు. దేశంలో అత్యాచారాలు పెరిగిపోతుంటే.. అమిత్ షా కఠిన చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారు?. పలు రాష్ట్రాల్లో గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు. తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం కోర్టు తీర్పు ఒక చెంపపెట్టు. ప్రజాహితం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు పలు చట్టాలు చేశాయి. భూసేకరణ చట్టం, నిర్బంధ విద్య, అటవీ రక్షణ చట్టాలు చేసింది. ఈ అంశాలపై మనం పోరాడాల్సిన అవసరం ఉంది.

**ఇక డీసీసీలదే పవర్**

ఏఐసీసీ విస్తృతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పవర్స్ కట్టబెట్టింది. ఇక నుంచి అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీలదే నిర్ణయమని వెల్లడించింది. ఇది ఏఐసీసీ నిర్ణయంగా ఖర్గే బుధవారం ప్రకటించారు.

## అమరావతి అభివృద్ధికి కేంద్ర సహకారం

కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు. 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో డబుల్ ఇంజన్ సర్కార్ కు ప్రజలు పట్టం కట్టారని, కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని ప్రజలు ఆశీర్వదించారని అన్నారు. అమరావతి నిర్మాణానికి, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రధాని మోడీ చెప్పారని తెలిపారు. వరల్డ్ బ్యాంకు ద్వారా రూ.15వేల కోట్లు, హడ్కో కింద రూ.11వేల కోట్లు ఏపీకి అందించడానికి నిర్ణయం చేశారని వెల్లడించారు. హడ్కో కింద 11వేల కోట్ల రూపాయలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. రూ.15వేల కోట్లు ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్ మెంట్ బ్యాంకు రూ.13వేల 600 కోట్లు ఇస్తుండగా కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1400కోట్లు అందిస్తుందని పురందేశ్వరి వెల్లడించారు. ఈ రూ.15వేల కోట్లు మొబలైజేషన్ లో 25శాతం గ్రాంట్ కింద ఇస్తామని కేంద్రం చెప్పిన విధంగా ఇటీవల 4వేల 285 కోట్లు కేంద్రం అందించిందని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే సహకారాన్ని అందిపుచ్చుకుంటూ అమరావతిని అద్భుతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పురందేశ్వరి కోరారు.

# ఢిల్లీ ఏపీ భవన్ లోని పౌరసరఫరాల శాఖ దుకాణంలో
# మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీ

**బియ్యం నాణ్యతను పరిశీలించిన మంత్రి నాదెండ్ల**
**బియ్యం బస్తా తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై ఆగ్రహం**
**ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న దుకాణం సీజ్**
**ఇకపై ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దుకాణం నడుస్తుందని ప్రకటన**

న్యూఢిల్లీ ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఢిల్లీలోని ఏపీ భవన్ లో ఉన్న పౌరసరఫరాల శాఖ దుకాణాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ అందుబాటులో ఉంచిన బియ్యం నాణ్యతను పరిశీలించారు. బియ్యం బస్తా తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ పేరుతో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. ఏపీ భవన్ లో నెల రోజుల్లో ప్రభుత్వ దుకాణం ఏర్పాటు చేస్తామని మంత్రి అక్కడిక్కడే ప్రకటించారు. ఇకపై ఏపీ భవన్ లోని దుకాణం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోనే నడుస్తుందని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మంత్రి నాదెండ్లతో పాటు పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ కూడా పాల్గొన్నారు.







# అంతా జగన్నాటకమే..

## హెలికాప్టర్ వివాదంపై హోం మంత్రి ఫైర్

విశాఖపట్నం ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలైందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్ రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని తెలిపారు. వీఐపీని తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని... వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు. మాట్లాడితే లా అండ్ ఆర్డర్ లేదు లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని.. గతంలో చంద్రబాబు బయటికి రాకుండా అడ్డుకున్నారని.. ఎయిర్‌పోర్టుల్లో గుండాలను పెట్టి, అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారని.. ఇలాంటివన్నీ చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్ రెడ్డి సంస్కృతి అని.. తమది కాదని స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించినందుకు తమ మీద అనేక మంది మీద కేసులుపెట్టారన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని.. కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువ భద్రత ఇస్తున్నామని వెల్లడించారు. పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో 2526 హత్యలు జరిగాయని.. అక్కడికి వెళ్తామన్నా కూడా.. తాము ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్వయంగా మీటింగ్ పెట్టి.. పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని.. ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గుర్తు చేశారు.




# ప్రజలకు ఆరోగ్యం.. ప్రభుత్వానికి ఆదాయం..

**-ఇదీ కూటమి ప్రభుత్వ మద్యం పాలసీ**
**-ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

తిరుపతి, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

:వైసీపీ పాలనలో ప్రజారోగ్యాన్ని దెబ్బ తీస్తూ, ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతూ మద్యం విధానం సాగిందని రాష్ట్ర ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఆరోగ్యం, ప్రభుత్వానికి ఆదాయం అనే రీతిలో మద్యం పాలసీ అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. పద్మావతి యూనివర్సిటీలో బుధవారం నాడు ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశాం. 2019- 24 మధ్య కాలంలో ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు.

మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు.. మద్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. కొత్త పాలసీ పేరుతో వ్యవస్త మొత్తాన్ని విచ్చిన్నం చేశారు. రాష్ట్రంలోని డిస్టిలరీల నుండి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. ఎన్ ఫోర్సు మెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారు.

మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, జే బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారు. జగన్ రెడ్డి అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని ఆరోపించారు.

"ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా పెరిగింది. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం. జే బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడగా, వేలాది మంది కిడ్నీ, లివర్ సమస్యలతో ప్రాణాలు కోల్పోయారు. కూటమి అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా జే బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగింది. 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం. అత్యంత పారదర్శకంగా డ్రా నిర్వహించి మద్యం షాపుల్ని కేటాయించాం. పారదర్శక లైసెన్స్ కేటాయింపు కారణంగా సుమారు 90వేల దరఖాస్తులు రాగా, రూ.1800 కోట్ల ఆదాయం వచ్చింది. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించాం.

ప్రజలకు ఆరోగ్యం.. ప్రభుత్వానికి ఆదాయం కాపాడే విధంగా పాలసీని తీసుకొచ్చాం" అని రవీంద్ర తెలిపారు.

"350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. మద్యం ధరలను కూడా పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగింది. గతంలో ఉన్న బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలించాం. గత ఐదేళ్లు ఎక్సైజ్ శాఖను విచ్చిన్నం చేసి సెబ్ ఏర్పాటుతో ఎన్ఫోర్స్మెంట్ కూడా సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. మొన్నటి వరకు గంజాయి అక్రమ రవాణా కారణంగా యువత జీవితాలు చిత్తయ్యాయి.

గంజాయి నిర్మూలన కోసం హోమ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసుకున్నాం. టూరిజం పెంపు కోసం 3స్టార్ హోటల్ కి లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం. గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారు. గత ఐదేళ్ల అక్రమాల గురించి ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారు. మొన్నటి వరకు పార్టీలో నెంబర్ 2 గా ఉన్న విజయసాయి రెడ్డి స్కాం జరిగిందని బయట పెట్టారు." అని గుర్తు చేశారు. క్యాష్ అండ్ క్యారీ.. విధానంతో దాదాపు లక్ష కోట్ల లావాదేవీలు జరగడంపై సీఐడీ విచారణ జరుగుతోంది. కానీ కూటమి పాలనలో అన్ని షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ అందుబాటులో ఉంచి పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మరోవైపు ఆన్ లైన్ ఇండెంట్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో పారదర్శకతకు శ్రీకారం చుట్టాం. బెల్ట్ షాప్ ఉంటే... మద్యం సరఫరా చేసిన వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



# నాకు తెలియదు.. నివేదిక ఇస్తే సంతకం చేశానంతే

**రఘురామకృష్ణం రాజు కేసు విచారణలో డాక్టర్ ప్రభావతి వింత సమాధానాలు**
**బెయిల్ రద్దు కోరే యోచనలో పోలీసులు**



ఒంగోలు ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నేను గైనకాలజిస్టుని అసుపత్రి సూపరింటెండెంట్ హోదాలో పనిచేసినప్పటికీ శరీరంలోని అంతర్గత గాయాల గురించి పెద్దగా అవగాహన లేదు. మా వైద్య సిబ్బంది రఘురామకృష్ణరాజును పరిశీలించారు. గాయాలు ఏమీ లేవని నివేదిక ఇచ్చారు. నేను చదివి సంతకం చేశానంతే.. అంతకుమించి నాకేమీ తెలియదు. ఇంతకుమించి ఇంకా ఏమైనా సమాచారం కావాలంటే ఏమీ చెప్పలేను మరచిపోయాను. రికార్డులు పరిశీలిస్తేనే ఏమైనా చెప్పగలను' ఇవీ పోలీసు విచారణలో డాక్టర్ ప్రభావతి ఇచ్చిన వింత సమాధానాలు, నాటి ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) విశ్రాంత సూపరింటెండెంట్ నీలం ప్రభావతి.. ప్రకాశం జిల్లా ఎస్పీ ఎ. అర్. దామోదర్ ఎదుట సోమ, మంగళవారం విచారణకు హాజరయ్యారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 8.45 గంటల వరకు సాగిన విచారణలో దర్యాప్త బృందం 20 ప్రశ్నలు సంధించినా ముక్తసరిగా సమాధానాలు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు మరోసారి దర్యాప్తు బృందం ప్రభావతిని సుదీర్ఘంగా విచారించింది. ఎంతగా ప్రశ్నించినా ఆమె నుంచి సరైన సమాధానాలు రాబట్టలేకపోయింది. ప్రతి ప్రశ్నకూ ఆమె ముక్తసరిగా కొన్ని సందర్భాల్లో అడ్డగోలుగా సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది.



## చైనాలో మరో కొత్త ఆవిష్కరణ.. తోకలేని యుద్ధవిమానం

చైనా మరోసారి సంచలన ఆవిష్కరణతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. సాంప్రదాయ విమానాలకు భిన్నంగా, తోకలేని (tail-less) యుద్ధ విమానాన్ని అభివృద్ధి చేసింది. చైనాలో ఓ జాతీయ రహదారిపై తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ ఈ విమానం కెమెరా కంటికి చిక్కింది. ఈ వినూత్న డిజైన్ విమానం పనితీరును మెరుగుపరచడమే కాకుండా, రాడార్లకు చిక్కకుండా ఉండేలా చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ఆరో తరం యుద్ధ విమానం %జీ%-36 పేరుతో చైనా వైమానిక దళంలో చేరనున్నట్లు తెలుస్తోంది. తోక లేకపోవడం వల్ల విమానం బరువు తగ్గడంతోపాటు, గాలిలో మరింత వేగంగా, సులువుగా విన్యాసాలు చేయగలదని భావిస్తున్నారు. ఇందులో మూడు ఇంజిన్లు అమర్చినట్టు తెలుస్తోంది.

**స్టెల్త్ టెక్నాలజీలో ముందడుగు**

తోకలేని డిజైన్ రాడార్లకు చిక్కకుండా ఉండే స్టెల్త్ టెక్నాలజీలో ఒక భాగమని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల శత్రుదేశాల రాడార్ వ్యవస్థలను సులభంగా తప్పించుకోగలుగుతుంది. అంతేకాకుండా, అత్యాధునిక ఆయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం కూడా ఈ విమానానికి ఉంది. ఈ విమానంలో అధిక మొత్తంలో ఆయుధాలను నిల్వ చేయొచ్చు. ఇది చైనా సైనిక శక్తిని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

**ప్రపంచ దేశాల ఆసక్తి**

చైనా ఈ విమానానికి సంబంధించిన సాంకేతిక వివరాలను గోప్యంగా ఉంచినప్పటికీ, దీని రూపకల్పన, పనితీరుపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, రష్యా వంటి అగ్రరాజ్యాలు ఈ విమానంపై ప్రత్యేక దృష్టి సారించాయి. తోకలేని యుద్ధ విమానం అభివృద్ధి చైనా సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనం. ఇది భవిష్యత్తులో యుద్ధ విమానాల రూపకల్పనలో కొత్త మార్పులకు నాంది పలుకుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఇలాంటి తోకలేని స్టెల్త్ యుద్ధ విమానాలు అమెరికా వద్ద ఉన్నాయి.

# వైకాపా నేత కాకాణికి హైకోర్టులో ఎదురుదెబ్బ!

అమలాపురం ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. క్వార్ట్జ్ తవ్వకాలపై పొదలకూరులో నమోదైన కేసుకు సంబంధించి అరెస్ట్ విషయంలో తొందరపడకుండా పోలీసులను ఆదేశించాలని, పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయాలని కాకాణి వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, రవాణా, నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల వినియోగం తదితరాలపై పొదలకూరు పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరిలో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇందులో ఏ4గా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని చేర్చారు. అనంతరం విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేయగా.. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటికే మూడుసార్లు నోటీసులు జారీ చేసిన పోలీసులు.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఆయన కోసం గాలిస్తున్నారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం10 ఏప్రిల్ 2025

# అమెరికా సుంకం భారం .. రొయ్య ధరలు దిగాలు

**అమలాపురం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మన దేశ ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించడంతో రొయ్యల సాగు రైతులు బేజారవుతున్నారు. ఈ పన్ను బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భరోసా ధర రైతులకు ఊరటనివ్వడం లేదు. వంద కౌంట్‌ను రూ.220కు కొనుగోలు చేయాలని ఎగుమతి వ్యాపారులకు చంద్రబాబు సూచించారు. అయితే, ఈ ధర తమకు గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. మిర్చి రైతుల పరిస్థితి మాదిరిగానే తమ పరిస్థితీ మారనుందని, భవిష్యత్తులో ఈ ధర పెరగకపోగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, విద్యుత్ కోతలను అధిగమించి రైతులు ఈ ఏడాది రొయ్యలను సాగు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పన అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో 100 కౌంట్ ధర రూ.260 నుంచి రూ.270 వరకూ పలికింది. దీంతో, వేసవిలో కూడా లాభాల పంట పండిస్తుందనే ఆశతో మార్చిలో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. అయితే, అమెరికా ప్రతీకార సుంకం ప్రభావం ఆక్వా రంగంపై తీవ్రంగా పడింది. రొయ్యల ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. 100 కౌంట్ రూ.200కు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. కౌంట్ ఒక్కంటికీ రూ.20 నష్టం ప్రస్తుతం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద రైతుల వద్ద రూ.10 వ్యత్యాసంలో ఆ ధరకు కొనుగోలు చేస్తున్నారు, చిన్న రైతులను



దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు రూ.20 నుంచి రూ.30 వరకూ కోత విధిస్తున్నారు. చెరువు నుంచి పట్టిన తర్వాత నిల్వ చేసుకునే అవకాశాలు లేకపోవడంతో తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఐ పోలవరానికి చెందిన జి. రాజు ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికా వైఖరిలో మార్పులేకపోతే భవిష్యత్తులో ధర మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కౌంట్ రూ.320కు మించడంలేదు. 80 కౌంట్ రూ.240 మాత్రమే ఉంది. అత్యధిక మంది రైతుల వద్ద 100 కౌంట్ పంట ఉంది. ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.90 వేల నుంచి రూ.1.25 లక్షలకు వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. పంట బాగా ఉంటే ఒక్కోసారి 5 టన్నుల వరకూ కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన కేజీకి రూ.240 నుంచి రూ.250 వరకూ ధర పలికితేనే నష్టాల నుంచి గట్టెక్కి కనీసం పెట్టుబడి అయినా దక్కుతుందని రైతులు అంటున్నారు. .ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ధరకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ నష్టం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.10 లక్షలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. సవాలక్ష సమస్యతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు అమెరికా విధించిన 26 శాతం సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆక్వా రైతులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు.



## మలేరియా వ్యాధి నిర్మూలనకు అవగాహన అవసరం.

**సఖినేటిపల్లి, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలోని సఖినేటిపల్లి,రామేశ్వరం, మోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా మలేరియా అధికారి ఎన్. వెంకటేశ్వరరావు ఆకస్మిక సందర్శన చేశారు. సీజనల్ జ్వరాల పై తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు తెలియజేశారు. జ్వరము సోకిన ప్రతి వారికి మలేరియా పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. ప్రతి శుక్రవారము డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించి ప్రతి నివాసగృహము ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించాలని, దోమల నివారణ కు అందరూ సహకరించాలని ఇందుకు సంబంధించి పి హెచ్ సి సూపర్ వైజర్స్ కు సిబ్బందికి కొన్ని సూచనలు సూచనలు చేశారు. లాబ్ పరిశీలించి లాబ్ టెక్నీషియన్ కు లాబ్ నిర్వహణకు కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డా. పి. జె.గాయత్రి, డా. సి హెచ్ దుర్గా కావ్య వైద్యాధికారులు, ఎం .రాజశేఖర్ రాజోలు యూనిట్ సబ్ యూనిట్ అఫీసర్ , టి విజయ, పి. ఎల్. ఎన్ స్వామి, ఏ.సరస్వతి హెల్త్ సూపర్ వైజర్స్ , పి.బి.శ్రీనివాస్ లాబ్ టెక్నీషియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నీ భాదితునికి గుడ్ సీడ్ ఫాండేషన్ ఆర్థిక సాయం




**అమలాపురం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కపిలేశ్వరపురం మండలం అద్దంకి వారి లంకకు చెందిన మానేపల్లి కార్తీక్ రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కిడ్నీ బాధితుడు కార్తీక్ వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. బుధవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావు రూ.15 వేలు చెక్ ను కార్తీక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు కార్తీక్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నేలపూడి సుగంధ కుమార్, పందిరి సుబ్బరాజు, గట్టెం వీరు, కంచర్ల జాన్సన్, పంతగంటి చిరంజీవి, కవల రాజ్ కుమార్, కోనాల రాజేష్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు అవస్థలు....

### సబ్ రోడ్ల విస్తరణ చేసినా ఫలితం శూన్యం



**అమలాపురం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం పట్టణంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సబ్ రోడ్లను విస్తరించినప్పటికీ, ఈ ప్రయత్నం ఊహించిన ఫలితాలను ఇవ్వడం లేదు. రోడ్ల విస్తరణతో ట్రాఫిక్ రద్దీని కొంతవరకు తగ్గించాలన్న లక్ష్యం నెరవేరకపోవడానికి కారణం వాహన యజమానుల అనుచిత పార్కింగ్ విధానాలు. రోడ్లకు ఇరువైపులా సెప్టిక్ క్లీనింగ్,వాహనాలతో పాటు ఇతర వాహనాలను అడ్డగోలుగా పార్క్ చేయడంతో, ఈ రహదారుల వెంబడి ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పట్టణంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో రోడ్ల విస్తరణ అవసరమైంది. అమలాపురానికి తలమానికమైన కలశం సెంటరువద్ద కాలువగట్టు వెంబడి మునిసిపల్ కాలనీ వరకూ లక్షలాది రూపాయలు వెచ్చించి ఇటీవల నూతనంగా రోడ్డును నిర్మాణం చేపట్టారు. దీనితో పట్టణంలో కొంత ట్రాఫిక్ సాఫీగా సాగుతుందని అధికారులు, ప్రజలు ఆశించారు. కానీ ఈ కొత్తగా విస్తరించిన రోడ్డును స్థానికంగా ఉండే వాహన యజమానులు పార్కింగ్ స్థలాలుగా మార్చేస్తున్నారు. ముఖ్యంగా సెప్టిక్ క్లీనింగ్ వాహనాలు, హైటెక్ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రోడ్డు పక్కనే దీర్ఘకాలం పార్క్ చేయడం వల్ల రహదారి ఇరుకుగా మారి, ఇతర వాహనాలు, నడక దారిన సాగడానికి ఇబ్బందికరంగా మారిందని.స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అడ్డంకుల వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ సర్వసాధారణంగా మారింది. రోడ్లను విస్తరించినా ప్రయోజనం లేకుండా పోయింది. పార్కింగ్ కోసం రోడ్లను ఆక్రమించడం వల్ల చిన్న వాహనాలు కూడా సాగడం కష్టంగా మారిందని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక, అత్యవసర వాహనాలైన అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్ వాహనాలు కూడా ఈ రద్దీలో చిక్కుకుని సమస్యలు ఎదుర్కొంటున్నాయని మరికొందరు పేర్కొన్నారు.ఈ సమస్యను పరిష్కరించేందుకు మునిసిపల్, పోలీసు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పార్కింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, నిర్దేశిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడం వంటి పరిష్కారాలు అవసరమని వారు సూచిస్తున్నారు. పార్కింగ్ సమస్యను నియంత్రించకపోతే, రోడ్ల విస్తరణకు ఖర్చు చేసిన లక్షలాది రూపాయల డబ్బు వృథా అవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పట్టణ ప్రణాళికా అధికారులు ఈ విషయంపై స్పందిస్తూ, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే వరకు అమలాపురం వాసులు ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమవుతూనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.





## అల్లవరంలో ఆకస్మిక తనిఖీలు చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్

### అల్లవరం హెచ్ఎం పిడిలకు షోకాజ్ నోటీసులు జారికి ఆదేశం...

**అల్లవరం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలో అల్లవరం జడ్పీ హైస్కూల్ రాష్ట్ర ఆహార కమీషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు వండే ఆహారాన్ని పరిశీలించగా సుమారు 300 గుడ్లు గత నెలవిగా గుర్తించారు. 253 మందికి భోజనం వండినట్లు రికార్డ్ లో వ్రాయగా అక్కడ పరిశీలనలో తక్కువ మందికి వండినట్లు గుర్తించి అగ్రహాం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆహారానికి సంబంధించి లిఖితపూర్వక ఫిర్యాదు కిరణ్ కి ఇచ్చారు. అవకతవకలు గుర్తించిన కిరణ్ స్కూల్ హెడ్ మాస్టర్ ,పిడి లకు షోకాజ్ నోటీసు జారిచేయలని విద్యాశాఖ ఏడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ మండల అధ్యక్షునిగా రాజేష్ తొలగింపు

### ఐదుగురు పార్టీ ప్రజా ప్రతినిధులతో మండల అడహక్ కమిటీ

**అయినవిల్లి, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



జనసేన పార్టీ మండల అధ్యక్షునిగా పోలిశెట్టి రాజేష్ తొలగించినట్లు పార్టీ అధిష్టానం నుండి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీ లో అంతర్గత విభేదాలు, దాడుల నేపథ్యంలో పి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తో పాటు నియోజకవర్గంలోని రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు సమగ్ర నివేదికను రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్పందిస్తూ జనసేన పార్టీలో క్రమశిక్షణారహిత్యానికి తావు లేదని అటువంటి వ్యక్తులను పార్టీ నుండి తొలగించడం జరుగుతుందన్నారని వివరించారు. ఈ మేరకు పార్టీ ఆదేశానుసారం ఎమ్మెల్యే సత్యనారాయణ మండల పార్టీ నిర్వహణ ఐదుగురు సభ్యులతో హడాహక్ కమిటీని నియమించారన్నారు. ఈ కమిటీ సభ్యులుగా మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా నాగభూషణం వీరవల్లి పాలెం, కొండుకుదురు, పోతుకుర్రు ఎంపీటీసీ గుర్రాల రమాదేవి రాంబాబు, విలస ఎంపీటీసీ కుప్పల ఈశ్వరి రాంబాబు, సర్పంచులు సలాది బుచ్చిరాజు వీరవలిపాలెం, మేడిద దుర్గాప్రసాద్ కొండుకుదురు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు.

## బీజేపీ బలోపేతానికి కృషి ప్రతి ఒక్కరూ చేయాలి

### జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ




**ఆలమూరు, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడపా సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆలమూరు మండలం జొన్నాడ బిసి కల్యాణ మండపంలో అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, పార్టీ బలోపేతం దిశగా సభ్యత్వాలను ముమ్మరం చేయాలన్నారు. బీజేపీ మోదీ నాయకత్వంలో సాధించిన విజయాలను, ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జ్ పొట్లూరు రామ్మోహన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుంటూరు జిల్లా ఇన్చార్జి రామకృష్ణారెడ్డి, సలాది వీరబాబు, రాష్ట్ర కౌన్సిలర్ నెంబర్ సిస్టర్ కుటుంబరావు, మండల అధ్యక్షుడు సుంకర శ్రీరాములు,కొత్తపేట అధ్యక్షులు సంపత్ కనకేశ్వరరావు, కృష్ణారెడ్డి, ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి స్వామి, ఎం వి కృష్ణారెడ్డి,కట్టా ప్రసాద్, పి రాజు,క్రియాశీల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఈ నెల 13 న అమలాపురంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం

**సఖినేటిపల్లి ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 13 వతేదీన అమలాపురంలో కోనసీమ కవితోత్సవం పేరిట శ్రీ శ్రీ కళావేదిక 147 వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం జరగనున్నదని సంస్థ అంతర్జాతీయ సి.ఈ.ఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు.సఖినేటిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని శ్రీ కళా గ్రాండ్ రెసిడెన్సీ నందు జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు . 150 మంది కవులు ఈ జాతీయ కవి సమ్మేళనం లో పాల్గోనున్నారన్నారు . కవితాగానం చేసిన కవులందరికీ జ్ఞాపిక , శాలువా , పూలమాలతో ఘనంగా సత్కరిస్తామన్నారు . ముఖ్య అతిధులుగా అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు , పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ హాజరుకానున్నారని ప్రతాప్ తెలిపారు .ఈ అవకాశాన్ని తెలుగు కవులందరూ సద్వినియోగపరచుకోవాలన్నారు .

# ఆహార భద్రత చట్టాన్ని సమన్వయంతో అమలు చేయాలి

**అమలాపురం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆహార భద్రత చట్టం అమలులో జిల్లాను అధికారులు సమన్వయంతో పనిచేసి ముందంజలో నిలపాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ సూచించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్ లో జిల్లాస్థాయి అధికారులతో తన పర్యటనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించడం జరుగుతుందని వివిధ అంశాల్లో గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దాలని ఆయన కోరారు. గృహ ఆహార భద్రత సమస్యను ప్రభుత్వం చాలా కాలంగా ప్రజా పంపిణీ వ్యవస్థల ద్వారా నిరంతరం పరిష్కరిస్తున్నప్పటికీ, 2013 జూలై 5న జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 అమలులోకి రావడంతో ఆహార భద్రత అనేది సంక్షేమం నుంచి హక్కుల ఆధారిత విధానం వైపు మార్పు చెందిందని చెప్పారు. ఈ చట్టం కింద చట్టబద్ధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలను పొందే హక్కును ప్రజలు పొందారన్నారు. జనాభాలో మూడింట రెండు వంతుల మంది అధిక సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలను పొందేందుకు ఈ చట్టం పరిధిలోకి వస్తారన్నారు. నిరుపేదలకు ఆహార భద్రత కల్పించడమే ప్రధాన జాతీయ ఆహార భద్రత చట్టం 2013 లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న నిరుపేద పిల్లలందరికీ నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆకలితో ఎవరూ మరణించకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భవతుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్క నిరుపేదకు రేషన్ షాపుల ద్వారా ఉచిత రేషన్ బియ్యాన్ని అందిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అమ్ముకోవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కిలో రూ.45 చెల్లించి రైతుల వద్ద బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాయని అంతేకాకుండా అందులో



పోషకాల కోసం మరికొన్ని పదార్థాలను బియ్యానికి జోడించి లబ్దిదారులకు ఒక్క రూపాయికే అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, 6 నెలల నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు పిల్లలకు ప్రత్యేక నిబంధనలు చేయబడ్డాయన్నారు, ఐసిడిఎస్ పథకం కింద అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమగ్ర శిశు అభివృద్ధి పథకాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కింద పాఠశాలల దర్వారా ఉచితంగా పోషకాహార భోజనం పొందే హక్కు వారికి కల్పించబడిందన్నారు. 6 సంవత్సరాల వరకు పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అధిక పోషకాహార ప్రమాణాలు సూచించబడతాయన్నారు గర్భిణీలు మాతృత్వ వందన యోజన ద్వారా మొదటి కాన్పుకు రూ.5 వేలు రెండో కాన్పులో ఆడపిల్ల అయితే రూ 6,000 ఒకే విడతలో నగదు ప్రసూతి ప్రయోజనాన్ని పొందేందుకు అర్హులన్నారు. ఆహార భద్రత కమిషన్ సభ్యుల పర్యటనలో సంబంధిత అధికారులు పాల్గొని సభ్యులు గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దాలని ఆమె ఆదేశించారు ఆహార భద్రత విషయంలో పర్యవే క్షణతో పాటుగా సభ్యుల సిఫార్సులను ఆచరిస్తూ లబ్ధిదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఉదయభాస్కర్, ఏఎస్ఓ శరత్, సివిల్ సప్లై డిఎం బాల సరస్వతి, డిఎం అండ్ హెచ్ ఓ దుర్గారావు దొర, తూనికలు కొలతలు శాఖ కంట్రోలర్ రాజేష్, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి పి.జ్యోతిలక్ష్మి దేవి, ఐసిడిఎస్ పిడి శాంతకుమారి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి

ఏలూరు ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈనెల 11వ తేదీన ఆగిరిపల్లిలో పలు కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని ఈ సందర్భంగా నిర్వహించే ప్రజా వేదక సభకు ప్రజలు స్వచ్ఛంధంగా హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పిలుపునిచ్చారు. బుధవారం ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.పి.ఎస్. కిషోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ తదితర అధికారులతో కలిసి రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11వ తేదీన ప్రముఖ సంఘ సంస్కర్త సామాజిక న్యాయంకోసం పోరాటం చేసిన గొప్ప యోధుడు, సాంఘీక అరాచకాలు ఎక్కువగా ప్రభలిన రోజుల్లో కూడా ధైర్యంగా బడుగు, బలహీన, అణగారిన వర్గాలకోసం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి ని అగిరిపల్లిలో రాష్ట్రస్థాయి కార్యక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్బంగా పూలే ఆశించిన ఆశయాలు కోసం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, బలహీన వర్గాల కుటుంబాల కోసం మంచి భవిష్యత్ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఆహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11వ తేదీన నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో పర్యటించనున్నట్లు మంత్రి పార్ధసారధి చెప్పారు. ఆరోజు ప్రత్యేకంగా చేతివృత్తుల వారు, నాయి బ్రాహ్మణులు కానీ, గొర్రెల కాపరులు గానీ, రజకులు గానీ, తదితర కుల వృత్తులమీద ఆధారపడి జీవిస్తున్న వారి పని స్థలాలకు వెళ్లి కుటుంబాలను పరామర్శించి వారి వృత్తుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అవగాహన చేసుకొని ఏ విధమైన ఆలోచన చేస్తే మేలుజరుగుతుందో తెలుసుకుని వారితో చర్చించేందుకు కొంత సమయాన్ని ముఖ్యమంత్రి కేటాయించునున్నారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమం వద్ద ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియపరచడం జరుగుతుందన్నారు. ఆ సభకు ప్రజలంతా స్వచ్ఛంధంగా హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్బంగా మంత్రి కొలుసు పార్ధ సారధి విజ్ఞప్తి చేశారు.

ఆదే విధంగా నూజివీడు నియోజకవర్గంలో పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. రిజర్వాయర్లను తలపించే పెద్ద చెరువులు ఈ ప్రాంతంలో ఉన్నాయని వాటికి లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తే సుమారు 25 ఎకరాలకు సాగునీటి సమస్య లేకుండా సాగుచేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. గత 5 సంవత్సరాల్లో గత ప్రభుత్వం ఎన్ఎస్ పి కాల్వను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రాంత రైతులకున్న హక్కులను కూడా పరిగణలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ విషయంపై తెలంగాణ నీటిపారుదల శాఖా మంత్రితో మాట్లాడి నీరురావడానికి కృషి చేశామన్నారు. అయితే ఎన్ ఎస్ పి కాలువ ను అభివృద్ధి పరిచేందుకు, మైనర్ ఇరిగేషన్ రిహాబిలిటేషన్ ప్లాన్ ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా రహదారి వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని నూజివీడు చుట్టుప్రక్కల రింగురోడ్డు ఏర్పాటుకు ముఖ్యమంత్రిని కోరనున్నట్లు ఆయన చెప్పారు. ఆగిరిపల్లిలోని వ్యాగ్రేశ్వర నరసింహస్వామి ఆలయ అభివృద్ధి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లతామన్నారు. గత ప్రభుత్వం ఆర్ధిక క్రమశిక్షణ రాహిత్యం మూలంగా రాష్ట్రం అప్పులపాలైయిందని, దీనిని గాడిన పెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా వేదిక సభ అనంతరం 5వేల మంది కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశమై తగు మార్గనిర్దేశం చేస్తారని మంత్రి కొలుసు పార్ధ సారధి తెలిపారు.





### ప్రజల సమస్యల పరిష్కారానికి

## సత్వర చర్యలు చేపట్టాలి - బడేటి చంటి

ఏలూరు ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార యజ్ఞం నిరాటంకంగా కొనసాగుతోంది. ఇదేక్రమంలో తాజాగా బుధవారం కూడా ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా వినతులు అందించేందుకు వచ్చిన వారితో కిక్కిరిసింది. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఒకపక్క మహిళలకు, మరోపక్క రైతులకు, ఇంకోపక్క యువతకు ఇలా అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందించేందుకు కూటమి ప్రభుత్వాధినేతలు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టామన్న ఆయన రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నగర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిబోయిన శివప్రసాద్, రెడ్డి నాగరాజు, నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### మత ఉగ్రవాద చర్యలను ప్రేరేపిస్తున్న

## రాంగోపాల్ వర్మ..

### వర్మపై త్రీటౌన్‌లో ఆర్‌పిసి అధ్యక్షులు మేడా ఫిర్యాదు



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రోజు రోజుకు రాంగోపాల్ వర్మ(అర్జివి) చేష్టలు శృతిమించి పోతున్నాయని, సామాజిక ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న అర్జివిపై చట్ట పరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సారథ్యంలో బుధవారం ఉదయం రాజమండ్రిలోగల 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా మీడియాతో మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ రాంగోపాల్ వర్మ కొన్ని మీడియా ఫ్లాట్ ఫామ్స్ ద్వారా అఖండ భారతీయులు అమితంగా విశ్వసించే రామాయణ, మహాభారతాల కోసం వ్యంగ్యంగా మాట్లాడుతూ భారతీయుల మనోభావాలను గాయపరుస్తున్నారు అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాల మధ్య కుట్ర పూరితంగా సొంత లాభాపేక్షకై ప్రాంతీయ విభేదాలను కొత్తగా రెచ్చగొడుతున్నారు అని ఆరోపించారు. మరింత పైసాచికత్వంతో భారతీయ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగాను శృతిమించిన ప్రేలాపనలు చేస్తున్నారు అని అన్నారు. అర్జివి మాటలు, చేష్టలు కారణంగా సమాజం భద్రత కోల్పోతుంది అని, మత ఘర్షనలకు తావునిస్తుంది అన్నారు. కొన్ని ఉగ్రవాద సంస్థలతో పోల్చుతూ హిందూ ధర్మ ద్వేవాలను వక్రీకరిస్తు తప్పుగా మాట్లాడుతూ యువతకు తప్పుడు సాంకేతాలను ఇస్తున్నారు అని ఆరోపించారు. వర్మ తీరుపై తక్షణమే 153- ఎ, 153-బి, 504, 506, 150-బి ఐ పి సి ,67 ఐ టి యాక్ట్ - 2000 చట్టాల ప్రకారం చర్యలు చేపట్టి శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్పిసి సెక్యూలర్స్ ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




### ఇరవై సూత్రాల అమలుతో

## రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి

### సమీక్షా సమావేశంలో ఛైర్మన్ లంకా దినకర్

మచిలీపట్నం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇరవై సూత్రాల అమలు తో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి జరుగుతుందని ఆ కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. కృష్ణ జిల్లా కు సంబంధించి " కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాల అంశాల పైన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సమన్వయంతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్టణం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ మట్టా ప్రసాద్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వర రావు వివిధ శాఖల అధికారులు జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు పై సమీక్ష నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోడీ గారి సంకల్పం వికసితభారత్ 2047, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ధ్యేయం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో నిర్వహించే కార్యాచరణ ద్వారా కృష్ణాజిల్లా పరిధిలో సమస్యలను అధిగమించి విజయవంతంగా " వికసిత కృష్ణాజిల్లా " గా రూపుదిద్దే స్ఫూర్తితో విజయవంతంగా సమీక్ష జరిగింది. ఉపాధిహామీ పథకం ప్రస్తుత అమలు తీరు, మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం మరియు 2019 - 24 మధ్య జరిగిన అవకతవకల పైన, జిల్లాలోని ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత త్రాగు నీరు కుళాయి ద్వారా ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ అమలు తీరు పైన, 2019 - 24 మధ్య జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 2015-16 లో అమృత్ పథకం క్రింద ఇచ్చిన నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు మరియు పనులలో మందగమనం, అమృత్ 2.0 లక్ష్యాల పైన, గ్రామీణసడక్‌యోజన, లాక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం సూర్య ఘర్, పీఎం ఆవాస యోజన మరియు టిడ్కో గృహాలు, పీఎం విశ్వకర్మ యోజన వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు బందరు పోర్ట్ నిర్మాణం పురోగతి పైన మరియు పోర్ట్ ఆధారిత ప్రాజెక్టుల అవసరం పైన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మరియు అధికారులతో కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ సమీక్ష చేయడం జరిగింది.

## జగన్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి

### జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భారత రాజ్యాంగం ప్రకారం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న పోలీసులను బట్టలు ఊడదీసి తన పవర్ చూపిస్తానని బెదిరించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై తక్షణమే నాన్ బైలబుల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కృష్ణా జిల్లా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ బుధవారం మచిలీపట్నంలో డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల కుంభకోణంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తిరుగుతున్న జగన్మోహన్ రెడ్డి బహిరంగంగా పోలీసులను హెచ్చరించడం విధి నిర్వహణలో ఉన్న పోలీసులను కించపరచడం అవమానపరచటం కింద వస్తుందని బాలాజీ అన్నారు. బాధ్యత గల శాసనసభ్యునిగా మాజీ ముఖ్యమంత్రిగా పోలీసులు గౌరవించవలసిన జగన్మోహన్ రెడ్డి వీధి రౌడీ గా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. రాష్ట్ర హెూంశాఖ మంత్రి, రాష్ట్ర డి.జి.పి తక్షణమే స్పందించాలని బాలాజీ డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థ ఒక్క నిమిషం కళ్ళు మూసుకుంటే సమాజం అల్లకల్లోలం అవుతుందని విషయం మీకు తెలియదా అని జగన్మోహన్ రెడ్డిని బాలాజీ ప్రశ్నించారు. అధికార పార్టీకి ప్రతిపక్ష పార్టీకి మరియు ఏ కార్యక్రమాలు జరిగినా కుటుంబ సభ్యులు ని విడిచిపెట్టి ప్రాంతం కానీ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలకు తమ ప్రాణాలను అడ్డుపెడుతున్న పోలీసులను ఎవరూ కూడా ఎప్పుడు దూషించకూడదు ద్వేషించకూడదని అని బాలాజీ హితవుపలికారు. పోలీసు వ్యవస్థ 24 గంటలు సమాజానికి రక్షణ వ్యవస్థ అని బాలాజీ అన్నారు. పోలీస్ కానిస్టేబుల్ గా ఎన్నిక కావడానికి ఎన్నో అర్హతలు కావాలని అంచలంచలుగా ఎదుగుతున్న పోలీస్ ల వ్యవస్థను బట్టలూడదీసి నిలబెడతామన్న జగన్మోహన్ రెడ్డి మాటలు తన దిగజారుడుతనానికి నిదర్శనం అని అన్నారు. తక్షణమే జగన్మోహన్ రెడ్డి పోలీసులకు బహిరంగంగా బేషరతుగా క్షమాపణ చెప్పాలని బాలాజీ డిమాండ్ చేశారు. కోడి కత్తి కేసు బాబాయ్ హత్య, మద్యం స్కాములు వంటి అనేక క్రిమినల్ కేసులో సంబంధం ఉన్న జగన్మోహన్ రెడ్డి పోలీసు వ్యవస్థను దూషించడం సరికాదు అన్నారు. తాను పరిపాలించిన ఐదు సంవత్సరాలు పోలీసులు లేకుండా బయటకు రాని జగన్మోహన్ రెడ్డి, ప్రస్తుతం పోలీసు సంరక్షణతోనే బయటికి వస్తున్న జగన్మోహన్ రెడ్డి, ఆ పోలీసులనే కించపరిచే విధంగా మాట్లాడటం సరైన విధానం కాదని బాలాజీ అన్నారు. పోలీస్ వ్యవస్థ పై నమ్మకం లేకపోతే జగన్మోహన్ రెడ్డి తనకు కేటాయించిన పోలీస్ ఎస్కార్ట్ ను బే షరతుగా ఉపసంహరించుకోవాలని బాలాజీ అన్నారు. జగన్మోహన్ రెడ్డి పై ఉన్న అన్ని కేసులు ఏ విధమైన అలసత్వం లేకుండా తక్షణమే విచారణ చేయాలని కూడా బాలాజీ డిమాండ్ చేశారు. అందుకు ఉభయ రాష్ట్రాలలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తగిన చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు.

## రక్షణ సంబంధాలు బలోపేతం చేసుకుందాం

### మోదీతో దుబాయ్ యువరాజు భేటీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తమ మధ్య రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మంగళవారం నిర్ణయించాయి. అదేవిధంగా సైనిక పరికరాలను సంయుక్తంగా అభివృద్ధి పరిచే అవకాశాలను అన్వేషించాలని అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వేర్వేరుగా వ్యూహాత్మక రంగాల్లో సహకారం లక్ష్యంగా నిర్వహించిన చర్చలు ఉపకరించాయి. ఈ క్రమంలో మక్తూమ్ భారత ప్రత్యేక పర్యటన ఇరు దేశాల మధ్య పటిష్ఠమైన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మార్గం ఏర్పరచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మక్తూమ్‌తో సమావేశమయ్యారు. భారత్-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పురోభివృద్ధికి దుబాయ్ కీలకపాత్ర పోషించిందని సామాజిక మాధ్యమ పోస్టులో మోదీ తెలిపారు. మక్తూమ్‌ను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా దుబాయ్ యువరాజుతో విడిగా భేటీ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో గల్ఫ్ దేశంతో కలిసి పనిచేసేందుకు ఆత్రుతతో ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. మధ్య ఆసియా ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం కృషి చేసేందుకు భారత్, యూఏఈ కట్టుబడి ఉన్నాయన్నారు. రెండు రోజుల భారత పర్యటన కోసం అల్ మక్తూమ్ మంగళవారం ఉదయం ఢిల్లీ చేరుకున్నారు. ఇక్కడ కార్యక్రమాల అనంతరం ఆయన ముంబయిలో పర్యటించనున్నారు.

## భారత్‌పై 26 శాతం టారిఫ్‌ల వేళ..

### క్యాబినెట్ కీలక సమావేశం



**అమెరికా :** భారత్‌పై అమెరికా విధించిన 26 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ టారిఫ్‌లతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ట్రేడ్ వార్ భయాల వేళ.. కేంద్ర ప్రభుత్వం కీలక క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించనుంది. వాటి ప్రభావాన్ని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించనున్నారు ట్రంప్ విధించిన టారిఫ్‌లలో ఇప్పటికే 10 శాతం అమల్లోకి రాగా.. తాజాగా మరో 16 శాతం నేటినుంచి అమలవుతోంది. తనకు మోదీ గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైనవిధంగా వ్యవహరించడం లేదని టారిఫ్‌ల విధింపు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు పేర్కొన్న సంగతి తెలిసిందే.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ మరో పిడుగు..

## 3 లక్షల మంది భారతీయులపై ప్రభావం

**ఓపీటీ ప్రోగ్రామ్ ఎత్తివేస్తే విదేశీ విద్యార్థులతో పాటు అమెరికా వర్సిటీలకూ నష్టమే**

**ఓపీటీతో కోర్సు పూర్తయ్యాక మూడేళ్ల పాటు అమెరికాలో పనిచేసే అవకాశం**

**అమెరికా యూనివర్సిటీలలో విదేశీ విద్యార్థుల చేరికపై ప్రభావం**

**అమెరికాలోని వివిధ యూనివర్సిటీలలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత చేసే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్ ను రద్దు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలతో ఓ బిల్లును కూడా సిద్ధం చేశారు. అమెరికన్ కాంగ్రెస్ ఈ బిల్లుకు ఆమోదం తెలిపితే విదేశీ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంతో అమెరికాలో చదువుకుంటున్న 3 లక్షల మంది భారతీయుల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఈ ప్రతిపాదిత బిల్లు నేపథ్యంలో విదేశీ విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.**

### ఏమిటీ ఓపీటీ?

ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్.. అమెరికాలోని యూనివర్సిటీలలో చదువు పూర్తిచేసుకున్న విదేశీ విద్యార్థులకు మూడేళ్ల పాటు ప్రాక్టికల్ వర్క్ కోసం అనుమతిచ్చే కార్యక్రమం. ఈ ప్రోగ్రాం కారణంగా విద్యార్థులు తమ విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత అమెరికాలోనే మూడేళ్ల పాటు పనిచేసే అవకాశం లభిస్తుంది. ఆ అనుభవంతో అదే కంపెనీలో పనిచేస్తూ హెచ్ 1 బీ వీసా పొందడం లేదా మరో కంపెనీలో హెచ్ 1 బీ వీసాతో ఉద్యోగం పొందే వీలుంటుంది. ఈ విధానం ద్వారా భారతీయ విద్యార్థులు అధిక ప్రయోజనం పొందుతున్నారు.

### ఈ ప్రోగ్రామ్ ను ఎత్తివేస్తే..




ప్రస్తుతం అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులు తమ కోర్సు పూర్తవగానే ఇండియా విమానం ఎక్కాల్సి వస్తుంది. దీనివల్ల వారు కెరీర్ పరంగా, ఆర్థికంగా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతారు. పరిమితంగా ఉండే హెచ్ 1 బీ వీసాల కోసం పోటీపడడం సాధ్యం కాదు. అదేసమయంలో అమెరికాకు కూడా ఈ బిల్లుతో నష్టం వాటిల్లే అవకాశాలు కూడా ఉన్నాయి. విదేశీ విద్యార్థులు ఉన్నతవిద్యాభ్యాసం కోసం ఎక్కువగా అమెరికాను ఎంచుకోవడానికి కారణం ఈ ప్రోగ్రామే. చదువు పూర్తయ్యాక అక్కడే మూడేళ్లు పనిచేస్తే హెచ్ 1 బీ వీసా పొందే అవకాశం ఉండడం విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తోంది.

ఈ ప్రోగ్రాం ఎత్తివేస్తే విదేశీ విద్యార్థులు అమెరికా యూనివర్సిటీలలో చేరే అవకాశం తగ్గుతుంది. ఫలితంగా యూనివర్సిటీలకు, అమెరికాకు ఆదాయం తగ్గుతుంది. దీంతోపాటు అమెరికా కంపెనీలకు నిపుణులైన ఉద్యోగులు దొరకడం దుర్లభంగా మారుతుంది. ఏటా పరిమిత సంఖ్యలో జారీ చేసే హెచ్ 1 బీ వీసాలతో కంపెనీల మానవ వనరుల అవసరాలు తీరే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు

# దానిని పాక్ ప్రజలే అంగీకరిస్తున్నారు

## ఉగ్రవాదంపై జైశంకర్ వ్యాఖ్యలు



**దిల్లీ: పాకిస్థాన్‌పై భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ విరుచుకుపడ్డారు. భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నామని ఆ దేశంలోని పలువురు ప్రజలు బహిరంగంగా.. గర్వంగా చెబుతున్నారన్నారు. న్యూస్18 రైజింగ్ భారత్ సమ్మిట్‌లో భాగంగా మంత్రి మాట్లాడారు.**

"ఇదంతా నేను చెప్పాల్సిన పనిలేదు. కళ్లకు కనిపిస్తోంది. వారే చెప్తున్నారు కూడా. భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నామని బహిరంగంగా ప్రకటించే వ్యక్తులు పాకిస్థాన్‌లో ఉన్నారు. ఇవి ఊహాగానాలు కాదు.. వారు గర్వంగా చెప్తోన్న విషయమిది. మీరొక టెర్రరిజం ఇండస్ట్రీని ప్రారంభిస్తే.. అదే మిమ్మల్ని దెబ్బతీస్తుందని ఎంతోమంది చెప్పారు. ఇప్పుడు మనం చూస్తున్నది అదే. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల నేడు పాక్ మూల్యం చెల్లించుకుంటోంది. నేను మీతో ఉదయం మంచిగా ఉండి.. రాత్రికి మీ ఇంటిపై వచ్చి దాడి చేస్తే మీకు ఓకేనా..? అలాంటివారితో కలిసి ఉంటారా..?" అని విదేశాంగమంత్రి ప్రశ్నించారు.

26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి అయిన తహవూర్ రాణా అప్పగింతపై మంత్రి స్పందించారు. "ఈ అంశంలో కొత్తగా చెప్పడానికి ఏమీలేదు. అమెరికా కోర్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని తెలిపారు. బలోచిస్థాన్‌లోని అస్థిరతపై మాట్లాడేందుకు నిరాకరించారు. రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. అతడిని తిరిగి అప్పగించేందుకు భారత్ కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేసింది. అప్పగింతను సవాల్ చేసిన రాణా.. న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకున్నా ప్రయోజనం లేకపోయింది. అతడిని తీసుకుని భారతీయ అధికారుల బృందం ప్రత్యేక విమానంలో ఇండియాకు తిరుగు పయనమైనట్లు తెలుస్తోంది. ఈ రాత్రికి లేదా రేపు తెల్లవారుజామున ఆ విమానం భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం.

ఇదిలాఉంటే.. పాక్‌ను ఉద్దేశించి జైశంకర్ గతంలోనూ ఈతరహా వ్యాఖ్యలు చేశారు. "మన పొరుగున ఉన్న పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించింది. ఇప్పుడు అదే వారి పాలిట శాపమైంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ సహా పలు దేశాలు కోరుతున్నాయి" అని అన్నారు.

### భారత్-చైనా సంబంధాలపై..

ఈ సందర్భంగా డ్రాగన్‌తో సంబంధాలపై జైశంకర్ మాట్లాడుతూ.. అవి సానుకూల దిశలో పయనిస్తున్నాయని అన్నారు. రెండు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేయాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తంచేశారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల జవాన్ల మధ్య జరిగిన ఘర్షణతో సంబంధాలు దిగజారాయి. తర్వాత సైనిక, దౌత్యపరమైన చర్చల ఫలితంగా కీలక గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దాని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు.

## అమరావతి-హైదరాబాద్

# గ్రీన్‌ఫీల్డ్ హైవేకి కేంద్రం పచ్చజెండా

**దిల్లీ: ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి, గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది.**




ఈ సమీక్ష సమావేశంలో అమరావతి-హైదరాబాద్ (%గూఝెుతీఖజుఖ్‌అ-ఎఎవతీఖఝెుఎ%) గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది.

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని.. దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.

## '2040 నాటికి చంద్రుడిపైకి భారత వ్యోమగామి..

# 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్'

**దిల్లీ: చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలతో ప్రపంచానికి తన సత్తాను చూపిన భారత్.. జాబిల్లిపై సొంత వ్యోమగామిని దించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. 2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగామి కాలుమోపుతాడని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డా. జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ ఆంగ్ల ఛానల్ ఏర్పాటు చేసిన 'రైజింగ్ భారత్ సమ్మిట్ 2025'లో ఆయన పాల్గొన్నారు. భారత అంతరిక్ష భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు. భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రం 'భారత్ స్పేస్ స్టేషన్'ను 2035 నాటికి సమకూర్చుకుంటుందని ఆయన వెల్లడించారు.**



ఇక చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విషయం తెలిసిందే. భారత వైజ్ఞానిక సత్తాను ఇది ప్రపంచానికి చాటింది. దీంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరుకున్న తొలి దేశంగా రికార్డు సృష్టించింది. ఇప్పుడు చంద్రయాన్-4పై దృష్టిసారించింది. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్మాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని 2027లో చేపట్టనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎల్‌వీఎం-3 రాకెట్‌ను కనీసం రెండుసార్లు ప్రయోగించి.. చంద్రయాన్-4 మిషన్‌కు సంబంధించిన ఐదు భిన్న భాగాలను నింగిలోకి పంపిస్తారు. వాటిని కక్ష్యలోనే బిగిస్తారు. చంద్రుడిపైకి భారత వ్యోమగామిని పంపించేంతవరకు చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలు కొనసాగుతూనే ఉంటాయని ఇస్రో ఇప్పటికే వెల్లడించింది. ఇక భారత తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌ను వచ్చే ఏడాది చేపట్టనున్నారు.

# రఫేల్ మెరైన్ ఫైటర్ల డీల్‌కు సై..

## అంగీకరించిన భారత్



**దిల్లీ: భారత నౌకాదళానికి అత్యాధునిక ఫైటర్ జెట్లను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ ఫైటర్ విమానాల కొనుగోలు డీల్‌కు భారత్ అంగీకరించింది. ఈమేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వార్త సంస్థ పేర్కొంది. ఈ డీల్ మొత్తం విలువ రూ.63,000 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు.**

దీనిపై అతి త్వరలోనే సంతకాలు చేసే అవకాశాలున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం 22 సింగిల్ సీటర్ విమానాలు, శిక్షణ కోసం నాలుగు ట్విటన్ సీటర్ విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు కూడా దీనిలో ఉండనున్నాయి. ఆఫ్‌సెట్ నిబంధన కింద దేశీయంగా కొన్ని విడిభాగాలు తయారుచేయాలనే షరతు కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ డీల్‌కు ఆమోదముద్ర వేసింది.

దేశీయంగా అభివృద్ధి చేసిన విమాన వాహక నౌకపై ఈ రఫేల్ మెరైన్‌లను మోహరించాలని భారత్ భావిస్తోంది. ఇది సముద్ర జలాల్లో మన దేశ నౌకాదళ శక్తిని గణనీయంగా పెంచనుంది. రఫేల్‌లో మెరైన్ శ్రేణి విమానాలను నౌకాదళాల అవసరాలను దృష్టిలోఉంచుకొని అభివృద్ధి చేశారు. దీని ల్యాండింగ్ గేర్ భిన్నంగా ఉండటంతోపాటు.. అరెస్టర్ హుక్స్, చిన్న రన్‌వేపై టేకాఫ్ అయ్యేలా ప్రత్యేకమైన ఎయిర్ ఫ్రేమ్ వంటి వాటిల్లో వాడారు. ఇప్పటికే ఇది పలు పోరాటాల్లో తన శక్తిని చాటుకొంది. దీనిలో అత్యాధునిక ఏవియానిక్స్, ఆయుధాలు వంటి ఫీచర్లు ఉన్నాయి.

ఈ విమానం ఒప్పందం కుదిరిన నాటినుంచి నాలుగేళ్లకు మన నౌకాదళానికి అందటం మొదలుకానున్నాయి. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి. ఈ విమానాలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌పై వినియోగించనున్నారు. ఇప్పటికే ఉన్న మిగ్ 29కే విమానాల స్థానాలను ఇవి భర్తీ చేయనున్నాయి. భారత్-ఫ్రాన్స్ ప్రభుత్వాలు ఈ డీల్‌పై సంతకాలు చేయనున్నాయి. డసాల్ట్ నుంచి డెలివరీ డెడ్‌లైన్లు, నిర్వహణ ఇతర అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రెంచి ప్రభుత్వమే చూస్తుంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
ఏప్రిల్ 10, గురువారం 2025


# పొట్టి కప్ ఫైనల్ సీన్ రిపీట్..

## పంత్ 'మాస్టర్ ప్లాన్' వర్కౌట్ !

12 ఓవర్లకు కోల్‌కతా నైట్‌రైడర్స్ స్కోరు 149/2. ఇంకా 8 ఓవర్లలో 90 పరుగులు చేస్తే ఆ జట్టుదే విజయం. ఇక్కడే లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వైపు మ్యాచ్ మలుపు తిరిగింది. అజింక్య రహానె (61) దూకుడు మీదున్నాడు. 13వ ఓవర్‌ను వేసేందుకు శార్దూల్ ఠాకూర్ సిద్ధమయ్యాడు. అదే ఊపులో ఓవర్‌ను వేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో. కానీ, లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్‌పంత్ ఉన్నట్టుండి నడుం నొప్పి అంటూ మైదానంలోనే ట్రీట్‌మెంట్ తీసుకోవడం మొదలుపెట్టాడు. అక్కడే ఫిజియో వచ్చి సపర్యలు చేశాడు. కాసేపటికి కోలుకోవడంతో ఆటను కొనసాగించాడు. ఈ ఓవర్‌ను శార్దూల్ వైడ్లతో ప్రారంభించాడు. వరుసగా ఐదు వైడ్లు వేశాడు. చివరి బంతికి రహానెను ఔట్ చేసి లఖ్‌నవూకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత రమణ్‌దీప్ (1), రఘువంశీ (5), వెంకటేశ్ అయ్యర్ (45), రస్సెల్ (7) వరుస ఓవర్లలో వికెట్లను సమర్పించారు. ఆఖర్లో రింకు (38లి), హర్షిత్ (10లి) పోరాడినా కోల్‌కతాకు ఓటమి తప్పలేదు.



### ట్రోలింగ్ మొదలైందిలా..

కోల్‌కతా విజయం సాధించే దిశగా వెళ్తున్న వేళ.. రిషభ్ పంత్ అలా వ్యవహరించడం వల్లే కేకేఆర్ బ్యాటర్ల ఏకాగ్రత కోల్పోయారని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్ గుర్తుకొచ్చిందంటూ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'ఫేక్ ఇంజ్యూరీ'తో పంత్ మరోసారి తన జట్టును గెలిపించాడంటూ ట్రోలింగ్ మొదలైంది. అప్పుడు కూడా పంత్ తన మోకాలి నొప్పిగా ఉందంటూ మ్యాచ్‌ను ఆపాడు. అప్పుడు దక్షిణాఫ్రికా విజయానికి 24 బంతుల్లో 26 పరుగులు మాత్రమే అవసరం. అక్కడ విరామం వచ్చాక సఫారీ జట్టు ఏకాగ్రతను కోల్పోయి ఓటమి పాలైంది. ఇప్పుడు కూడా ఇలానే పంత్ చేశాడని కొందరు ఫ్యాన్స్ కామెంట్లు చేశాడు.

"కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్ ఓడిపోవడానికి కారణం రిషభ్ పంత్. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడు. అప్పటివరకు లక్ష్య ఛేదన దిశగా సాగుతోన్న కేకేఆర్ ఒక్కసారిగా కుదేలైంది. గతంలో దక్షిణాఫ్రికాపైనా ఇలానే వ్యవరించాడని రోహిత్ శర్మ ఓసారి వెల్లడించాడు"

"రిషభ్ పంత్ మాస్టర్ ప్లాన్ మరోసారి బయటపడింది. ప్రత్యర్థి రిథమ్‌ను దెబ్బకొట్టడంలో స్పెషలిస్ట్. కోల్‌కతా - లఖ్‌నవూ పోరులో పంత్ గేమ్ ఛేంజర్"

"మ్యాచ్‌ను స్లోగా మార్చడంలో రిషభ్ పంత్‌కు తిరుగులేదు. గాయం పేరుతో ఆటను ఆపే నటనలో ఆరితేరిపోయాడు. ఇప్పుడు చూశాం. గతంలోనూ ఇలాంటి అనుభవం ఎదురైంది. ఇప్పుడు మరోసారి వర్కౌట్ అయింది"

# వరుసగా 4వ మ్యాచ్‌లో ఓడిన చెన్నై.. ప్లే ఆఫ్స్ నుంచి ఔట్?

**ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. పంజాబ్ కింగ్స్‌పై 18 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఇది మూడో విజయం. దీంతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలోకి దూసుకొచ్చింది. వరుసగా నాలుగో ఓటమితో చెన్నై జట్టు 9వ స్థానానికి పడిపోయింది.**



ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. పంజాబ్ కింగ్స్‌పై 18 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఇది మూడో విజయం. దీంతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలోకి దూసుకోచ్చింది. వరుసగా నాలుగో ఓటమితో చెన్నై జట్టు 9వ స్థానానికి పడిపోయింది.

మంగళవారం ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో 220 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు మాత్రమే చేయగలిగింది. డెవాన్ కాన్వే 49 బంతుల్లో 69 పరుగులు చేసిన తర్వాత రిటైర్డ్ అవుట్ అయ్యాడు. ఎంఎస్ ధోని 12 బంతుల్లో 27 పరుగులు చేశాడు. లాకీ ఫెర్గూసన్ 2 వికెట్లు పడగొట్టాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. పంజాబ్ తరఫున ప్రియాంష్ ఆర్య 42 బంతుల్లో 103 పరుగులు చేశాడు. అతను 39 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ప్రియాంష్ కాకుండా, శశాంక్ సింగ్ 52 పరుగులతో, మార్కో జాన్సెన్ 34 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఖలీల్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ తలా 2 వికెట్లు పడగొట్టారు.

### రెండు జట్ల ప్లేయింగ్-11..

చెన్నై సూపర్ కింగ్స్- రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), రచిన్ రవీంద్ర, డెవాన్ కాన్వే, విజయ్ శంకర్, రవీంద్ర జడేజా, ఎంఎస్ ధోని (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, నూర్ అహ్మద్, ముఖేష్ చౌదరి, ఖలీల్ అహ్మద్, మతీష్ పతిరాణ.

ఇంపాక్ట్ ప్లేయర్స్: శివమ్ దూబే, జామీ ఓవర్టన్, రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, అన్షుల్ కాంబోజ్.

పంజాబ్ కింగ్స్- శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), నెహాల్ వధేరా, శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కో యాన్సన్, లాకీ ఫెర్గూసన్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్.

ఇంపాక్ట్ ప్లేయర్స్: సూర్యాంశ్ షెడ్గే, యశ్ ఠాకూర్, ప్రవీణ్ దూబే, అజ్మతుల్లా ఒమర్జాయ్, విజయ్‌కుమార్ వైశాఖ్.

# అప్పుడు తెలుగులో స్టార్ హీరోయిన్..

## ఇప్పుడు ఐపీఎల్‌లో కోట్లు సంపాదిస్తున్న బ్యూటీ..

**90'లలో ఆమె తోపు హీరోయిన్. తెలుగు, హిందీలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంది. వెంకటేశ్, మహేష్ బాబు, షారుఖ్, సల్మాన్ ఖాన్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించింది. పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైన ఈ అమ్మడు.. ఇప్పుడు వ్యాపారరంగంలో కోట్లు సంపాదిస్తుంది. ముఖ్యంగా ఐపీఎల్?లో హీరో షారుఖ్ ఖాన్ ను సైతం బీట్ చేసింది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ ప్రీతీ జింటా. దిల్ సే సినిమాలో చిన్న పాత్రతో అడియన్స్ మనసులు గెలుచుకుంది. ఆ తర్వాత 'క్యా కెహ్నా', 'కోయి మిల్ గయా', 'వీర్-జారా' వంటి సూపర్ హిట్ చిత్రాలలో మరింత పాపులర్ అయ్యింది. తెలుగులో వెంకటేశ్ సరసన ప్రేమంటే ఇదేరా.. మహేష్ బాబు జోడిగా రాజకుమారుడు చిత్రాల్లో నటించి తెలుగువారికి దగ్గరయ్యింది.**

కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడు పెళ్లి చేసుకుని సినిమాలకు దూరమైన ఈ హీరోయిన్.. 2008లో వ్యాపార ప్రపంచంలోకి అడుగుపెట్టింది. 2008లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (%ఖూా%)లో ప్రీతి జింటా ఏకైక మహిళా జట్టు యజమాని. ఆమె ముగ్గురు భాగస్వాములతో కలిసి కింగ్స్ %శ×% పంజాబ్ (ఇప్పుడు పంజాబ్ కింగ్స్) జట్టులో పెట్టుబడి పెట్టింది. ఈ జట్టును కొనుగోలు చేయడానికి దాదాపు 76 మిలియన్ డాలర్లు అంటే రూ.662 కోట్లు ఖర్చు చేసింది. 2022 నాటికి ఈ జట్టు విలువ 925 మిలియన్ డాలర్లు. అంటే రూ.7775 కోట్లు.



ప్రీతి జింటా లాస్ ఏంజిల్స్‌కు చెందిన జీన్ గూడెనఫ్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి 2021లో సరోగసి ద్వారా కవలలు అమ్మాయి, అబ్బాయి జన్మించారు. ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి లాస్ ఏంజిల్స్ లో సెటిల్ అయిన ప్రీతి జింటా ప్రతి ఐపీఎల్ సీజన్ లో భారత్ కు వస్తుంది. ప్రీతి జింటాకు ముంబైలో రెండు విలాసవంతమైన అపార్ట్‌మెంట్లు, సిమ్లాలో ఒక అందమైన బంగ్లా ఉంది. దీని విలువ రూ.7 కోట్లు. ప్రీతికి అమెరికాలోని బెవర్లీ హిల్స్‌లో ఒక విలాసవంతమైన విల్లా ఉంది. అలాగే ఆమెకు నిర్మాణ సంస్థ ఉంది. దీని విలువ రూ.600 కోట్లు. అలాగే ఈ బ్యూటీ దగ్గర లెక్సస్ %వాశ% 470, రూ. 58 లక్షల విలువైన మెర్సిడెస్ బెంజ్ %జు%-క్లాస్, %దీవీఔ%, పోర్షే వంటి లగ్జరీ కార్లు ఉన్నాయి.

# ఓవైపు లక్నో, మరోవైపు పంజాబ్ విజయాలు..

## ప్లే ఆఫ్స్ నుంచి తప్పుకునేది ఈ జట్లే?



**మంగళవారం ఏప్రిల్ 8న రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఐపీఎల్ 2025 తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కోల్‌కతా నైట్ రైడర్స్‌ను నాలుగు పరుగుల తేడాతో ఓడించింది. ఈ విజయంతో లక్నో ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానానికి చేరుకుంది.**

మరోవైపు రెండో మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 18 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పడిపోయింది. అలాగే పంజాబ్ మూడు విజయాలతో 4వ స్థానంలో నిలిచింది.

2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఈ రేసులో అగ్రస్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ రెండవ స్థానంలో ఉంది. సోమవారం ముంబై ఇండియన్స్ పై విజయం సాధించిన తరువాత, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది.

1) ఢిల్లీ క్యాపిటల్స్ : (మ్యాచ్‌లు %-% 3, గెలుపు %-% 3, ఓడినవి %-% 0, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 6, నెట్ రన్ రేట్ %- 1.257)

2) గుజరాత్ టైటాన్స్ : (మ్యాచ్‌లు %-% 4, గెలుపు %-% 3, ఓడినవి %-% 1, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 6, నెట్ రన్ రేట్ %- 1.031)

3) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు : (మ్యాచ్‌లు %-% 4, గెలుపు %-% 3, ఓడినవి %-% 1, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 6, నెట్ రన్ రేట్ %- 1.015)

4) పంజాబ్ కింగ్స్ : (మ్యాచ్‌లు %-% 4, గెలుపు %-% 3, ఓడినవి %-% 1, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 6, నెట్ రన్ రేట్ %- ం0.289)

5) లక్నో సూపర్ జెయింట్స్ : (మ్యాచ్‌లు %-% 5, గెలుపు %-% 3, ఓడినవి %-% 2, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 6, నెట్ రన్ రేట్ %- ం0.078)

6) కోల్‌కతా నైట్ రైడర్స్ : (మ్యాచ్‌లు %-% 4, గెలుపు %-% 2, ఓడినవి %-% 2, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 4, నెట్ పరుగు రేటు %- -0.056)

7) రాజస్థాన్ రాయల్స్ : (మ్యాచ్‌లు %-% 4, గెలుపు %-% 2, ఓడినవి %-% 2, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 4, నెట్ పరుగు రేటు %- -0.185)

8) ముంబై ఇండియన్స్ : (మ్యాచ్‌లు %-% 5, గెలుపు %-% 1, ఓడినవి %-% 4, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 2, నెట్ పరుగు రేటు %- 0.010)

9) చెన్నై సూపర్ కింగ్స్ : (మ్యాచ్‌లు %-% 5, గెలుపు %-% 1, ఓటమి %-% 3, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 2, నెట్ రన్ రేటు %- -1.629)

10) సన్‌రైజర్స్ హైదరాబాద్ : (మ్యాచ్‌లు %-% 5, గెలుపు %-% 1, ఓటమి %-% 4, ఫలితం లేదు %-% 0, టై %-% 0, పాయింట్లు %-% 2, నెట్ రన్ రేట్ %- -1.629).

# ఐపీఎల్ హిస్టరీలో ఫాస్టెస్ట్ సెంచరీ ఇదే..

## టాప్ 5లో ప్రీతి జింటా ప్లేయర్





**అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు.**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే బ్యాటర్ల ఆధిపత్యం చెలాయించే టీ20 క్రికెట్ అనేది తెలిసిందే. ప్రతి సంవత్సరం అనేక రికార్డులు నమోదవుతుంటాయి. కొన్ని బద్దలవుతుంటాయి. ఈ క్రమంలో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడితే, ఐపీఎల్ చరిత్రలో చాలానే ఫాస్టెస్ట్ సెంచరీలు నమోదయ్యాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన పేరు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ దే కావడం విశేషం. గేల్ కేవలం 30 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. గేల్ తర్వాత ట్రావిస్ హెడ్, విల్ జాక్స్ వంటి ప్లేయర్లు కూడా ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. 2013లో పూణే వారియర్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన సమయంలో క్రిస్ గేల్ 30 బంతుల్లో సెంచరీ చేసిన సెంచరీ ఇప్పటికీ ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీగా నిలిచింది. ఈ ఇన్నింగ్స్ అత్యంత వేగవంతమైనది మాత్రమే కాదు, టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచింది. ఆ మ్యాచ్‌లో గేల్ 175 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇది కూడా ఓ రికార్డు. గేల్ తర్వాత, యూసుఫ్ పఠాన్ పేరు నిలిచింది. పఠాన్ 2010లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నప్పుడు ముంబై ఇండియన్స్‌పై 37 బంతుల్లో సెంచరీ చేశాడు. పఠాన్ చేసిన ఈ సెంచరీ భారత బ్యాట్స్‌మన్ చేసిన వేగవంతమైన సెంచరీలో మొదటి కావడం విశేషం.తాజాగా పంజాబ్ కింగ్స్ ప్లేయర్ ప్రియాంష్ ఆర్య చెన్నై సూపర్ కింగ్స్‌పై కేవలం 39 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన రెండవ భారతీయుడిగా ప్రియాంష్ రికార్డులకెక్కాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# చూపు తిప్పనివ్వని సికాకుళం చిన్నది

తెలుగు ప్రేక్షకులు సిద్దు ఫ్రమ్ సికాకుళం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మంజరి ఫడ్నిస్. తెలుగులో ఈమె చేసిన సినిమాలు తక్కువే అయినా, ఈ మధ్య కాలంలో ఈమె తెలుగు సినిమాల్లో కనిపించకున్నా ఈమె గతంలో చేసిన పాత్రల కారణంగా తెలుగు ప్రేక్షకులు గుర్తు పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో ఈమధ్య కాలంలో ఈమె రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తోంది. ఆకట్టుకునే అందం తో పాటు, ఈమె నటనకు పలు సినిమాలతో మంచి మార్కులు పడ్డాయి. అందుకే ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది.

2004లో హిందీ సినిమా రోక్ సాకో తో రోక్ లో తో మంజరి ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ఆ సినిమాతో పెద్దగా గుర్తింపు దక్కనప్పటికీ తన అందం కారణంగా ఆఫర్లను సొంతం చేసుకుంది. తెలుగులో ఈమె మొదటి సారి సిద్ధు ఫ్రమ్ సికాకుళం సినిమాతో 2008లో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో తెలుగులో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లను సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఆమె తెలుగులో నటించిన కొన్ని సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అయితే ఈమెకు ఎక్కువ శాతం మెయిన్ హీరోయిన్ పాత్రలు దక్కక పోవడంతో పాటు, స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్లు దక్కక పోవడంతో నిరాశే మిగిలింది.

టాలీవుడ్‌లో వరుసగా నిరాశే మిగలడంతో ఆఫర్లు కనుమరుగు అయ్యాయి. అయితే ఈమెకు తెలుగులో మిస్ అయిన ఆఫర్లు హిందీ నుంచి వచ్చాయి. బాలీవుడ్‌లో క్రమం తప్పకుండా చిన్నా చితకా సినిమాల్లో నటిస్తూ వచ్చింది. మధ్య మధ్యలో కన్నడ సినిమాలు, మరాఠీ సినిమాలను సైతం ఈమె చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 5 లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న మంజరి తన అందమైన ఫోటోలతో ఆకట్టుకుంటూ ఉంది. తన ఫాలోవర్స్‌కి రెగ్యులర్‌గా వినోదాన్ని అందిస్తున్న ఈమె మరోసారి ఈ ఫోటోలతో వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మరోసారి ఈమె తన గురించి మీడియాలో చర్చ జరిగేలా చేసింది.

రింగుల జుట్టుతో అందమైన బ్రా లెస్ ఔట్ ఫిట్‌తో మంజరి ఫడ్నిస్ చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయిలో అందంగా ఉన్నప్పటికీ మంజరికి రావాల్సిన గుర్తింపు దక్కలేదు. దక్కాల్సిన ఆఫర్లు దక్కలేదు అంటూ పలువురు అభిప్రాయం చేస్తున్నారు. జానే తు యా జానే నా మంచి విజయం సాధించడంతో ఇప్పటికీ బాలీవుడ్‌లో ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. గత ఏడాది సైతం ఈమె నటించిన సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఒక హిందీ సినిమాతో పాటు ఒక మరాఠీ సినిమాను ఈమె చేస్తుందని తెలుస్తోంది. త్వరలోనే ఆ సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతున్నప్పటికీ ఈ స్థాయిలో క్రేజ్ దక్కించుకోవడం ఈమెకే చెల్లింది. ఇకపై అయినా ఈమెకు వరుస ఆఫర్లు దక్కాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.


# మోహన్ బాబు ఇంట్లోకి మనోజ్ కు నో ఎంట్రీ... గేటు బయటే కింద కూర్చున్న మనోజ్

**మరోసారి వీధికెక్కిన మోహన్ బాబు కుటుంబ విభేదాలు**
**మోహన్ బాబు ఇంట్లోకి వెళ్లేందుకు మనోజ్ యత్నం**
**అనుమతి లేదని బయటే ఆపేసిన పోలీసు అధికారులు**



ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు కుటుంబంలో నెలకొన్న విభేదాలు కొనసాగుతున్నాయి. మోహన్ బాబు, ఆయన పెద్ద కుమారుడు మంచు విష్ణు ఒక వర్గంగా... రెండో కుమారుడు మంచు మనోజ్ మరో వర్గంగా విడిపోయారు. మంచు కుటుంబ రచ్చ రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇప్పుడు మరోసారి మంచు కుటుంబంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ జల్ పల్లిలోని మోహన్ బాబు ఇంట్లోకి వెళ్లేందుకు మనోజ్ తన కుటుంబంతో సహా అక్కడకు వెళ్లారు. అయితే, అందరినీ దూరంలోనే పోలీసులు ఆపేశారు. మనోజ్ ను మాత్రం ఇంటి వరకు అనుమతించారు. అయితే, మనోజ్ లోపలకు వెళ్లకుండా గేటు మూసేశారు. ఇంట్లోకి వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదని పోలీసు అధికారులు తెలిపారు. దీంతో, గేటు బయటే రోడ్డుపై మనోజ్ బైఠాయించారు. మనోజ్ అక్కడకు వస్తున్నాడనే సమాచారంతో అప్పటికే అక్కడ పోలీసులు మోహరించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా భద్రతను ఏర్పాటు చేశారు. తన కూతురు పుట్టినరోజు సందర్భంగా భార్యాపిల్లలతో రాజస్థాన్ కు ఈ నెల 1న వెళ్లానని... అప్పుడు తన సోదరుడు విష్ణు 150 మందితో జల్ పల్లిలోని తన ఇంట్లోకి ప్రవేశించి వస్తువులు, సామగ్రి ధ్వంసం చేశాడని... తన కారును దొంగిలించి విష్ణు ఇంట్లో పార్క్ చేశాడని పోలీసులకు నిన్న మనోజ్ ఫిర్యాదు చేశారు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఈరోజు మోహన్ బాబు ఇంటికి మనోజ్ వెళ్లాడు.





# సినీ నటుడు సప్తగిరి ఇంట్లో విషాదం

**సప్తగిరి తల్లి చిట్టెమ్మ కన్నుమూత - బెంగళూరులో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన చిట్టెమ్మ**
**ఈరోజు తిరుపతిలో అంత్యక్రియలు**

సినీ నటుడు సప్తగిరి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. సప్తగిరి తల్లి చిట్టెమ్మ తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చిట్టెమ్మ బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు తిరుపతిలోని పద్మాపురం ఎదురుగా ఉన్న శ్రీనివాసపురంలో ఈరోజు జరగనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చిట్టెమ్మ భౌతికకాయానికి నివాళి అర్పించేందుకు పలువురు సినీ ప్రముఖులు రానున్నట్టు సమాచారం. సినిమాల విషయానికి వస్తే సప్తగిరి కమెడియన్ గానే కుండా హీరోగా కూడా నటిస్తున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఇందులో ప్రభాస్ సినిమా 'రాజాసాబ్' కూడా ఒకటి.

# నా సినిమాలలో నాకు నచ్చింది అదే: నటి శారద!

**నా అసలు పేరు సరస్వతి - నేను ఇండస్ట్రీకి రావడం నాన్నకి ఇష్టం ఉండేది కాదు**

**నాకు పేరు రావడం ఎన్టీఆర్ గారు ఇచ్చిన అవకాశం - శోభన్ బాబు గారి మాట వినలేదన్న శారద**



శారద .. ఒకప్పుడు వెండితెరపై వెలిగిపోయిన కథానాయిక. ఊర్వశిగా బిరుదును అందుకున్న శారద, వాయిస్ పరంగా కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారు. పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలలో రాణించిన హీరోయిన్స్ లో శారదనే ముందుగా కనిపిస్తారు. అలాంటి శారద వయసు పైబడిన కారణంగా చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. తాజాగా ఒక యూ ట్యూబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "మాది తెనాలి .. నా అసలు పేరు 'సరస్వతి'. నేను ఇండస్ట్రీకి వచ్చేసరికి ఆ పేరుతో కొంతమంది ఆర్టిస్టులు ఉన్నారని తెలిసి మా నాన్నగారు 'శారద' అని మార్చారు. నిజానికి నేను సినిమాలలోకి రావడం మా నాన్నగారికి ఇష్టం ఉండేది కాదు. మా అమ్మ ప్రోత్సాహం వల్లనే నేను ఇండస్ట్రీకి వచ్చాను. నేను చేసిన చాలా సినిమాలు విజయవంతమయ్యాయి. వాటిలో నాకు బాగా నచ్చిన సినిమా 'మనుషులు మారాలి'. ఆ సినిమాను 4 భాషలలో తీస్తే .. నాలుగు భాషల్లోను హీరోయిన్ గా నేనే చేశాను" అని అన్నారు. "ఎన్టీఆర్ .. ఏఎన్నార్ .. కృష్ణ .. శోభన్ బాబు .. కృష్ణంరాజు .. ఇలా అందరితో చేశాను. ఎన్టీఆర్ గారి సినిమాలలో నా పాత్రకి ఎక్కువ ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఆయన ఏమీ అనేవారు కాదు. అలా నాకు మంచి పేరు రావడానికి ఆయన ఒక కారణమని చెప్పొచ్చు. వారి సినిమా సెట్లో నేను ఉంటే .. బసవతారకం గారు వచ్చి పలకరించేవారు. అలాంటివారి అభిమానాన్ని పొందడం నిజంగా నేను చేసుకున్న అదృష్టం అనే చెప్పాలి" అన్నారు. "శోభన్ బాబు గారు అందరితోను చాలా కలుపుగోలుగా ఉండేవారు. ఆ ప్రవర్తన కారణంగా అందరూ అభిమానంతో ఉండేవారు. అప్పట్లో ఆయన భూమిపై పెట్టుబడి పెట్టడం వలన ఆయన బిడ్డలంతా హ్యాపీగా ఉన్నారు. నాతో కూడా చెప్పారు .. కానీ నేను దానిని అంత సీరియస్ గా తీసుకోలేదు. అయినా భగవంతుడు ఇచ్చిన దానిలో నేను సంతృప్తితోనే ఉన్నాను. నా స్థాయిలో నేను సేవా కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నాను" అని చెప్పారు.

# 'కన్నప్ప' విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్



**మంచు విష్ణు, ముకేశ్ కుమార్ సింగ్ కాంబోలో 'కన్నప్ప'**
**జూన్ 27న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటన**
**మూవీ రిలీజ్ డేట్ పోస్టర్ ను ఆవిష్కరించిన యూపీ సీఎం**

మంచు విష్ణు హీరోగా ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కన్నప్ప' సినిమా కొత్త విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో వివిధ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఈ మూవీ రిలీజ్ డేట్ పోస్టర్ ను ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు.



ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు, మంచు విష్ణు, ఈ చిత్రానికి కొరియోగ్రఫీ అందించిన ప్రభుదేవా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన 'కన్నప్ప' కొత్త విడుదల తేదీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం సీఎం యోగి మూవీ యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కాగా, ఏప్రిల్ 25న విడుదల కావాల్సిన ఈ సినిమాను వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కాని కారణంగా వాయిదా వేశారు. తాజాగా ఈ చిత్రం కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఇక ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చిన విషయం తెలిసిందే. 'కన్నప్ప'లో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ నాయికగా నటిస్తోంది. మంచు మోహన్ బాబుతో పాటు మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339